ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

సెప్టెంబర్ 28, 2014

మన 'మలాలా'లు

ఎర్ర తివాచీ ఎవరి కోసం?



పాటతో పడేస్తారా!





స్టార్లూ సింగర్లైపోతున్నారు. పవన్‌కళ్యాణ్ నుంచి నేటి యంగ్ స్టార్ ఆది వరకు ... హమ్ చేయడమో ... పూర్తిగా పాడడమో చేస్తున్నారు. 'అత్తారింటికి దారేది'లో పవన్ పాడిన పాట ప్రేక్షకులకు పిచ్చ పిచ్చగా నచ్చేసింది. 'బిజినెస్‌మేన్'లో మహేష్ బాబు హమ్ చేశాడు. అలా కాకుండా ఈసారి తన కొత్త చిత్రం కోసం పూర్తిగా పాడనున్నాడు. మంచు మనోజ్ బ్రేకప్ సాంగ్ పాడేశాడు. జూనియర్ ఎన్టీఆర్ సైతం రభస' కోసం 'రాకాసి...రాకాసి...' పాడేశాడు. రవితేజ తక్కువా! 'నౌటంకి..నౌటంకి'... అంటూ పాడేశాడు. అయితే ఈ ఘనత మాత్రం సంగీత దర్శకుడు తమన్‌దే. ఇంక యువ నటుడు ఆది తన 'ప్యార్ మే పడిపోయానే' కోసం 'చిన్న పిల్లలు' పాట పాడాడు.

'సినిమా క్లైమాక్స్‌లో ఓ బ్రేకప్ సాంగ్ కావాల్సి వచ్చింది. చిత్ర దర్శకుడు (జి.నాగేశ్వరరావు), సంగీత దర్శకుడు (అచ్చు) నన్ను పాడమని అడిగారు. తమాషాగా వుంటుందని పాడేశా' అంటున్నాడు మనోజ్ మంచు. ఇక జూనియర్ ఎన్టీఆర్ పాట గురించి. 'ఈ పాటకు ఒక కొత్త గొంతు, గాయకుడు అవసరమైంది. తారక్ ఆ పనిని అద్భుతంగా చేశాడు' అంటున్నాడు దర్శకుడు సంతోష్ శ్రీనివాస్. రవితేజ ఇటీవలి తన చిత్రం కోసం మాంచి జోష్ మీద మాస్ పాట పాడేశాడు. 'చిన్న పిల్లలు'తో ... ఒక పాట పాడాలన్న చిరకాల వాంఛ తీరిందంటున్నాడు ఆది. 'నేను అనూప్ రూబెన్స్‌కి గొప్ప అభిమానిని. తను స్వరాలు కూర్చిన పాట పాడాలన్నది నా కోరిక. ఆ అవకాశం ఇచ్చినందుకు అతనికి ధన్యవాదాలు చెప్పాలి. పాట అంత పెద్ద హిట్టవుతుందని ఊహించనే లేదు' అంటాడు ఆది ఆనందంగా. నటిగా నిరూపించుకోకమునుపే సింగరైన శృతిహాసన్ తన రాబోయే చిత్రం కోసం ఓ పాట పాడడమే కాక...దానికి డాన్స్ కూడా చేసిందట. సిద్దార్థ్ ఓ తమిళ చిత్రం కోసం తన పదిహేనవ పాట పాడనున్నాడు. వీరి స్ఫూర్తితో ... ఎందరు తారలు సింగర్ల అవతారం ఎత్తుతారో చూడాలి.

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

పులుల మధ్య...

◆ మనలో మాట

చావుతో చెలిమి చేయగలమా! దానితో చనువు కుదిరే పనేనా! మృత్యువుతో సహ జీవనం సాధ్యమేనా? అలాంటి భయంకర పరిస్థితి ఎదురైతే? మృత్యువు ముఖంలో ముఖం పెట్టాల్సిన క్షణమే ఆసన్నమైతే? చావు నులి వెచ్చటి శ్వాస ... తనువును తాకేంత దగ్గరగా వెళ్లాల్సి వస్తే? మృత్యు పాశం విసురుతున్న వెయ్యి మంది యముళ్లు ... కట్ట కట్టుకొచ్చి కళ్ల ముందు ప్రత్యక్షమైన అనుభూతి కలగదూ. నరకం నకలు ... భీతిల్లిన నయనాల్లో ప్రతిబింబించదూ.

ఢిల్లీ జూపార్క్‌లో పులి పంజాకు బలైన కుర్రాడు తన చివరి క్షణాల్లో వీటన్నిటినీ చవిచూశాడు. అమాయకత్వమో, అయోమయమో మృత్యువును వెతుక్కుంటూ వెళ్లాడు. వందలాది మంది చూస్తుండగానే క్రూరమృగానికి ఆహారమయ్యాడు. తోటి మనిషి పులి బారిన పడి ప్రాణ రక్షణకై చేతులు జోడించి వేడుకోవడాన్ని .. వేడుకలా తిలకించి సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు శిలాహృదయులు. మౌనంగా కన్నీరు కార్చారు సున్నిత హృదయులు. విషాద ఘటన అనంతరం ... జూలో భద్రతా ఏర్పాట్లు సక్రమంగా లేవనీ...అధికారులు అప్రమత్తంగా వ్యవహరించలేదనీ...పలు విధాలుగా పంచనామా చేస్తున్నారు. జాలి కురిపిస్తున్నారు. ఒక్క మనిషి కళ్లెదురుగా పులి బోనులో పడి ప్రాణాలు కోల్పోయినందుకే ఇంతగా విలవిల్లాడిపోతున్నామే! రోజుకి ఎన్నో వేల మంది... పులుల నోట చిక్కుకుంటున్నారే? వారి సంగతేంటి?

వాన కురిసినా...పువ్వు విరిసినా... తమ కోసమే అనుకునే అల్ప సంతోషులు చిన్నారులు. ఆ లేత మనసుల బాల్యాన్ని పరమ కిరాతకంగా మింగేసే పులి ఒకటి మన మధ్యే వుంది. అదే కార్పొరేట్ విద్య. దాని కోరల్లో చిక్కుకున్న పసిమొగ్గలు... ఆటపాటలకు, ఇష్టమైన వ్యాపకాలకు దూరంగా... మనుషులకు దూరంగా .... బుల్లి రోబోలుగా మారిపోతున్నారు.

ఉక్కు కండరాలతో.. ప్రగతిశీల భావాలతో ... దేశాన్ని ముందుకు నడిపించాల్సిన యువతను బలి తీసుకునే పులి ఒకటి మన పక్కనే వుంది. అదే కార్పొరేట్ వ్యాపారం. దీనికి మనుషులు మనుషుల్లా కాక... సరకును కొనుగోలు చేసే వినియోగదారులుగానే కనిపిస్తారు. ఆ వినిమయ సంస్కృతిలో పడి సర్వస్వాన్నీ కోల్పోతున్నారు. ఇదే పులి అమాయకపు ఆడపిల్లలనూ బలి తీసుకుంటోంది. వారికి లేనిపోని ఆశలు చూపి శరీరాన్నే అమ్ముకునేందుకు సిద్ధం చేస్తోంది. ధనవంతులకు దేహాన్ని పరిచి చావుకు దగ్గరయ్యేలా పురికొల్పుతోంది.

యువతలో దాగిన సహజసిద్ధమైన శక్తి సామర్థ్యాలను, ప్రజ్ఞాపాటవాలను స్వాహా చేసే పులి ఒకటుంది. అదే కెరీరిజం. ఈ పులి మీద స్వారీ దేనికి దారితీస్తుందో తెలియనిదేముంది?

వృద్ధాప్యాన్ని మింగేసే పులి కూడా ఒకటుంది. దాని పేరు కెరీర్. ఈ రేస్‌లో పడి కొట్టుకుపోతూ ... వృద్ధాప్యంలో వున్న తల్లిదండ్రులను సైతం భారమనుకుంటున్నారు. వారి మానాన వారిని విడిచిపెట్టి... శాశ్వతంగా వదిలించుకుంటున్నారు.

మన చుట్టూ ఇన్ని రకాల పులులు వున్నాయి. వాటిని గుర్తించి ...వాటి కోరలకు చిక్కకుండా...బలి కాకుండా బైట పడగలమా? అందుకు ఏం చేయాలి?

ఆలోచించాల్సిన తరుణం ఆసన్నమైంది మరి.

❄



టపా

నిరాదరణకు నిదర్శనం

ఈ వారం 'వస్తున్నా నాన్నా...' కథ చాలా బాగుంది. నేటి పరిస్థితులకు అద్దం పట్టేలా ఉంది. యువతకు చదువులు, మంచి ఉద్యోగాలు, డబ్బు, ఉద్యోగంలోని ఉన్నత స్థానం కోసమే ఎప్పుడూ ఆలోచిస్తుంటారు తప్ప .... వాళ్లు ఆ స్థితికి చేరుకోవడానికి గల తల్లిదండ్రుల్ని మాత్రం వదిలేస్తున్నారు. ఉద్యోగ బాధ్యతలనే ఊబిలో మానవీయ విలువలు కూరుకుపోయేలా చేసుకుంటున్నారు. అలాగే ప్రధానంగా దృష్టిలో ఉంచుకోవాల్సింది... కోడళ్లు కూడా అత్తమామల్ని తల్లిదండ్రులుగా భావిస్తేనే సంబంధాలు చివరి వరకూ కొనసాగుతాయి. లేకపోతే మధ్యలోనే తెంచుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటాయి. ఇది ఎవరైనా గమనంలో ఉంచుకోవాల్సిందే!

జె.సునయన, గుంటూరు.

ఆకట్టుకున్న విగ్గుల కథనం

సమ్‌థింగ్ స్పెషల్‌లో 'వింత నిరసన' తమాషాగా వుంది. ఆమె అత్యాచారానికి నిరసనగా తన పరుపుని తను ఎక్కడికెళితే అక్కడికి మోసుకెళ్తూ తన అసంతృప్తిని తెలియచేస్తోంది. 'నిరసనలు ఇలా కూడా చేయొచ్చు' అనేది కూడా ఈమె ద్వారా జనాలకి తెలుస్తుంది. ఇక 'ప్రత్యేకం'లో విగ్గుల మాస్టర్ కుమార్ గురించి ఇచ్చిన కథనం ఆకట్టుకుంది. కేన్సర్ రోగుల్ని కూడా దృష్టిలో పెట్టుకొని విగ్గులు తయారు చేయడం... వారికివ్వడం ద్వారా వారి ఆత్మన్యూనతను పోగొట్టిన వారవుతున్నారు. ఏది ఏమైనాగానీ ఇలాంటి వాటి ద్వారా కొత్త కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

ఎస్.విమల్, బంటుమిల్లి.

సీరియల్ ఇవ్వడం బాగుంది

'వింత లోకం'లో వస్తున్న విషయాలు ఆకట్టుకుంటున్నాయి. సారీ కూడా అమ్ముడవడం నిజంగా వింతే కదా...! మనసులోని భావాల్ని వ్యక్తపరచడానికి ప్రత్యేకమైన మనిషిని పెట్టుకోవడం, వారికి నజరానాలు చెల్లించుకోవడం నేటి యువతకే చెల్లుతుందేమో! మార్క్స్, జెన్నీల ప్రేమ, పెట్టుబడి రచనకు సంబంధించి సీరియల్ ఇవ్వడం బాగుంటోంది. ప్రపంచ ప్రసిద్ధి పొందిన మార్క్స్ జెన్నీల జీవిత విశేషాలు తెలియనివి తెలుసుకుంటున్నందుకు ఆనందంగా, తెలీని అనుభూతికి లోనవుతున్నట్లుగా ఉంది.

టి. సంపత్‌కుమార్, విజయవాడ.

'ఎబోలా' ఎన్నో చెప్పింది

కవర్‌స్టోరీ ఎబోలా వైరస్ గురించి ఇవ్వడం సందర్భానుసారంగా ఉంది. ఎందుకంటే ఆ వైరస్ గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. అది అసలు ఎక్కడ పుట్టింది... దాని ద్వారా వచ్చే వ్యాధి ద్వారా హాని ఏంటి? ఇవన్నీ కూడా పాఠకులకు అర్థమయ్యే విధంగా ఇచ్చారు. ఆ వ్యాధి కారకమైన వైరస్‌కు ఇంతవరకు మందే లేకపోవడం బాధాకరమైన విషయం. ఇప్పటికీ కొన్ని ప్రాణాంతక వ్యాధులకు మందులు లేకపోవడం బాధాకరం.

సాంబశివరావు, సుగుణ, చీరాల.

హేట్స్ ఆఫ్ మంజూ!

రియల్‌స్టార్‌లో వచ్చిన కథనం చాలా బాగుంది. నిజంగా భర్త చనిపోతే ఆ కుటుంబం ఎన్ని కష్టాలు, బాధలు ఎదుర్కోవాలో తెలియజేసేది మంజు కథ. కన్న బిడ్డల్ని ఉన్నత స్థానంలో నిలబెట్టడానికి తను పోర్టర్‌గా మారడం... ఆ కష్టాల్ని భరించడం, చాలా గొప్ప విషయం. నిజంగా అలాంటి మహిళల్ని చూసి జాలి పడడం కాదు... ఎంతో ధైర్యం కూడా తెచ్చుకోవాలి.

హిమబిందు, నెల్లూరు.

ఈ సంచికలో....

ఎర్ర తివాచీ ఎందుకోసం?

కవర్‌స్టోరీ 14

ఎంత మార్పు ! నిన్నటి వరకు నరేంద్రమోడీ అమెరికన్ల దృష్టిలో అంతర్జాతీయ వెలివేతకు గురైన వ్యక్తి !! నేడు, సరిలేరు నీకెవ్వరూ రావయ్యా రా రాజరాజ నరేంద్రా అంటూ వంగి వంగి సలాములు. కళ్లు దిమ్మతిరిగే రాచ మర్యాదల ఎర్రతివాచీ. సంవత్సరాల తరబడి అమెరికా సందర్శనకు వీసా ఇచ్చేందుకు నిరాకరించిన అమెరికా జన్మజన్మల బంధం అన్నంతగా ఇప్పుడు కావలించుకుంటున్నది. గతంలో వీసా నిరాకరించిన చర్యకు హర్షాతిరేకం ప్రకటించిన ప్రజాస్వామిక, పౌరహక్కుల వాదులు ఇప్పుడు ఔరా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. అమెరికా గడ్డపై అడుగు పెట్టనివ్వకపోవటాన్ని అవమానంగా భావించిన మోడీ అనుయాయులు తమ నేత అమెరికన్లను ఎన్నటికీ క్షమించడనీ పలికిన పలుకులన్నిటినీ దిగమింగి అమెరికాలో రాచమర్యాదలకోసం తహతహలాడుతున్నారు.

చూద్దామా 4
గోవాలో అలా... అలా...
కథ 6
ఒక పసికూన కోసం...
నవ్వుల్- పువ్వుల్ 8
రుచి 9
దసరా స్పెషల్స్
కొత్త పుస్తకాలు 10
చరితార్థుల సందర్శనం
మన 'మలాలా'లు 12
సీరియల్ 18
ప్రేమ- విప్లవం
వింతలోకం 21
బొమ్మ భర్త
బాలనేస్తాలు 22



ప్రత్యేకం
కవలల గ్రామం 24

ఫేస్‌బుక్

గంజాయి కంటే తీవ్రమైన వ్యసనం

గంజాయి, సారా, విస్కీ వీటికి బానిసలైన వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకు రావటం అంత సులభం కాదు. ఇప్పుడు వాటికి తోడు ఇ మెయిల్, ఫేస్‌బుక్, ట్విటర్, ఎస్ఎంఎస్ వంటివి తోడయ్యాయి. చివరి మూడింటికి పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు అనే తేడా లేదు. అందరూ బానిసలుగా మారిపోతున్నారు. ఇదేదో మన రాష్ట్రంలో జరుగుతున్న పరిణామం కాదు, ప్రపంచవ్యాపితంగా జరుగుతోంది.

అమెరికాలో ఒక సాధారణ కార్మికుడు లేదా కార్మికురాలు రోజుకు సగటున 74 సార్లు తమ ఇమెయిల్ సమచారాన్ని చూసుకుంటున్నారని అమెరికన్ ప్రొఫెసర్ గ్లోరియా మార్క్స్ చెబుతున్నారు. కాలిఫోర్నియాలోని క్రియేటివ్ లీడర్‌షిప్ అనే సంస్థకు చెందిన జెన్నీఫర్ డీల్ ఏమంటారంటే స్మార్ట్ ఫోన్ ఉన్న వైట్ కాలర్ శ్రామికులు రోజుకు 13.5 గంటల పాటు ఇమెయిల్స్‌తో గడిపేస్తున్నారట. ఈ వ్యవధిలో సగటున 230 మెయిల్స్ తొలగించటం లేదా సమాధానాలు పంపటం వంటివి చేస్తున్నారు. చివరికి అది ఎంత యాంత్రికంగా మారిందంటే పక్కనే రెండు అడుగుల దూరంలో కూర్చున్న సహచరులకు సైతం మెయిల్స్‌తో సమాధానమిస్తున్నారట. మూడోవంతు మంది వారు భోజనం చేస్తున్న సమయంలో కూడా వారి చేతులు అటే లాగటాన్ని నిరోధించలేకపోతున్నారట.ఇమెయిల్ ఒక జీవన విధానంగా లేదా వ్యసనంగా మారిపోయింది.

పురాణ కాలంలో రుక్మిణి తన ప్రేమ సందేశాన్ని పురోహితునితో పంపితే, ఎందరో రాకుమారులు, కుమార్తెలు తాము ప్రేమించిన వారికి పావురాలతో పంపిన సందేశాల గురించి మనకు తెలుసు. పోస్ట్‌మాన్ కోసం ప్రేమికుల ఎదురు చూపులు, ఆ లేఖలను పట్టుకొనేందుకు కొందరు తలిదండ్రుల పాట్లు, ప్రహసనాలు. ఇప్పుడంతా ఇన్‌స్టంట్ లవ్ ! ఎస్ఎంఎస్‌లు, బొమ్మల సందేశాలు !!

ప్రతి కాలంలోనూ సందేశాలను అడ్డుకొనే ప్రయత్నాలు జరిగాయి. వర్తమాన యుగంలోనూ అదే జరుగుతోంది. పెట్టుబడిదారులు తమ లాభాల కోసం తయారు చేసిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తమకు నష్టదాయకంగా మారినపుడు దాన్ని అడ్డుకొనేందుకు సైతం వెనుకాడరు. జర్మనీలో పని సమయాల్లో ఇమెయిల్ సందేశాలు అందకుండా డైమలర్, ఓక్సవాగన్, డచ్ టెలికాం వంటివి ఏర్పాట్లు చేశాయి. ఈమెయిల్ పిచ్చి ఎంతవరకు పోయిందంటే ఏ రోజైనా వారి మెయిల్ బాక్సు ఖాళీగా కనిపిస్తే తామెవరికీ అవసరం లేదని, అంత ముఖ్యులుగా కనిపించటం లేదని, పనికిరాని వారిగా పక్కన పెట్టేస్తున్నారనే మానసిక వ్యాధికి గురౌతున్న విపరీత ధోరణులు కూడా వెల్లడౌతున్నాయి.

గత శతాబ్దిలో అనేక మంది కంప్యూటర్లు, రోబోలు వచ్చి తమకు మరింత వెసులుబాటు కల్పిస్తాయని, పనిని సులభతరం చేస్తాయని కలలు కన్నారు. కానీ ఈ మెయిల్ తమకు దొరికిన ఖాళీ సమయాన్ని హరించి వేస్తుందని, ఒక వ్యసనంగా మారుతుందని స్నేహితులు, కుటుంబ సభ్యులతో గడపనీయకుండా చేస్తుందని, సుఖసంతోషాలను దూరం చేస్తుందని అసలు ఊహించి ఉండరు.

ఫేస్‌బుక్ స్నేహం కూడా ఒక వ్యసనంగా మారుతోంది. దానిలో చేరేవారంతా నిజంగా స్నేహితులుగానే ఉంటారా? వారితో మనం పంచుకొనే విషయాలు స్నేహానికి సూచికలేనా అని ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలి. కొన్ని వ్యాఖ్యలను సరదా లైక్ చేస్తున్నట్లు మనం అంగీకరించామనుకోండి, కొన్ని సందర్భాలలో అవి ప్రాణం మీదకు తెస్తాయి. ఫేస్‌బుక్ మీద మీరు గడుపుతున్న సమయం నిజంగా అంత అవసరమా, ఉపయోగమా అని ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలి. మీకు నిజంగా తెలియని వారిని స్నేహితులిగా జాబితాలో చేర్చుకోవటం అంత మంచిది కాదు. ప్రత్యక్షంగా స్నేహితులతో గడిపే సమయం కంటే ఫేస్‌బుక్ స్నేహితులతో గడపటం ఎక్కువ కావటం మంచిది కాదు. ఇమెయిల్, ఫేస్‌బుక్, ట్విటర్‌కు బానిసలయినట్లు మీరు గ్రహించినా, ఎవరైనా మీ దృష్టికి తెచ్చినా దానికి దూరమయ్యేందుకు ప్రయత్నించండి. సాధ్యంగాకపోతే మానసిక వైద్యుడితో అవసరం పడినట్లే. ఈ జబ్బు బారిన పడిన వారు విద్యార్థులైతే చదువు దెబ్బతినే అవకాశం ఉంది. నార్వేలో ఫేస్‌బుక్ వ్యసనాన్ని నిర్ధారించేందుకు ఒక సూచికను తయారు చేశారు. ఈ క్రింది అంశాలను మీరు అంగీకరించినట్లయితే మీకు సమస్య ఉన్నట్లే. ఫేస్‌బుక్ గురించి ఎంతో సమయం మీరు ఆలోచించటం లేదా దాన్ని ఎలా ఉపయోగించుకోవాలా అని ప్రణాళిక రూపొందించటం, ఫేస్‌బుక్‌ను ఎక్కువగా ఉపయోగించాలని మీరు తహతహలాడటం, మీ వ్యక్తిగత సమస్యలను మర్చిపోవటం కోసం ఫేస్‌బుక్‌ను ఉపయోగించటం, ఫేస్‌బుక్ వినియోగం తగ్గించాలని ప్రయత్నించి విఫలం కావటం, ఫేస్‌బుక్‌ను వినియోగించకుండా మిమ్మల్ని నిరోధించటం లేదా నిషేధించినపుడు మీరు అసహనానికి గురికావటం, మీ చదువు లేదా ఉద్యోగంపై ఫేస్‌బుక్ వినియోగం ప్రతికూల ప్రభావం చూపటం. వీటికి మీరు అవునంటే సమస్యలో పడినట్లే.

- సత్య

గోవాలో అలా... అలా...

గోవా అనగానే గుర్తొచ్చేది రెండే రెండు! ఒకటి... అందమైన సముద్రతీరం. రెండు... రోజువారీ ఒత్తిళ్లను మర్చిపోయి...హాయిగా సంచరించే జంటలు. పత్రికల్లో...సినిమాల్లో...యాత్రా కథనాల్లో... గోవా అందాలను చూసిన ఎవరికైనా ...ఒక్కసారైనా అక్కడికి వెళ్లాలనిపించకమానదు. అదే గోవా ప్రత్యేకత. అయినా తినబోతూ రుచులెందుకు?! అక్కడ చూడదగిన... ప్రకృతి అందాలతో నిండిన రకరకాల బీచ్‌లతో పాటుగా...స్థానికుల గురించి కూడా తెలుసుకుందాం.

అందాల గోవా సందర్శనకు అక్టోబరు – మే అనువైన సమయం అంటారు. కానీ, సంవత్సరమంతా సెలవుల వాతావరణమే కనిపిస్తుంది. ఇక్కడి ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు చక్కగా పాటిస్తారు. సొంత కార్లూ బైకులూ ఉన్నా ఎక్కువ మంది లోకల్ బస్సుల్లోనే ఆఫీసులకు వెళుతుంటారు. హైదరాబాద్, ముంబయి, ఢిల్లీలాంటి మహానగరాల్లో ప్రజలు ఫాస్ట్ ఫార్వర్డ్ చేసిన క్యాసెట్‌లా ఎలా ఉరుకులూ పరుగులూ తీస్తారో తగోవాలో నివసించే వారు అంత నిదానం, ప్రశాంతం.

గోవాలోని రెండు ప్రధాన భాగాలు సౌత్ గోవా, నార్త్ గోవా. ఎక్కడకు వెళ్లినా అందమైన బీచ్‌లే. ప్రతి బీచ్‌లోనూ తనివితీరా తిరిగి అనుభూతుల వర్షంలో తడిసి ముద్దయిపోతాం. గోవా అనగానే, అర్ధనగ్నంగా తిరిగేవాళ్లు ఎక్కువగా ఉంటారనీ కొత్త దంపతులు తప్ప కుటుంబంతో వెళ్లేవాళ్లు ఇబ్బందిగా ఫీలవుతారని ఓ అపోహ ఉంది. కానీ, అది ఎంత మాత్రం నిజం కాదు. గోవాకు ఎవరైనా సరే, భార్యాపిల్లలతో నిస్సంకోచంగా వెళ్లొచ్చు.

రైలు ప్రయాణంలో వుంది మజా

గోవాకు రైల్లో వెళుతున్నప్పుడు దారిలో కనిపించే సుందర ప్రకృతి దృశ్యాలను... నిండైన పచ్చని అడవుల్నీ ఎత్తైన కొండల్నీ లోతైన లోయల్నీ చూసి తీరాల్సిందే. మధ్యమధ్యలో సొరంగ మార్గాల ద్వారా రైలు వెళుతున్నప్పుడు కొన్ని క్షణాల వరకూ అది మిట్ట మధ్యాహ్నామో మధ్యరాత్రో అర్థంకాదు. అంత చీకటి కమ్ముకుంటుంది. ఆ సమయంలో రైల్లో ఉన్న వారంతా కేరింతలు కొడుతుంటారు. ఒకచోట రెండు ఎత్తైన కొండలు, ఆకాశంలో మేఘాల్ని అంటుకున్నట్లే ఉంటాయి. ఆ రెండు కొండల శిఖరాల మధ్య నుంచి ధారాళంగా నీళ్లు జాలువారుతుంటాయి. తెల్లని నురగలతో ఎగసిపడే ఆ నీటిని చూస్తుంటే ఆకాశగంగ క్షీరాభిషిక్తయై భువికి చేరుతున్నట్లుగా ఉంది. అందుకేనేమో ఆ ప్రాంతాన్ని 'దూద్ సాగర్' జలపాతం అంటారు.

గోవా నగరం పచ్చని చెట్లతో అందమైన పార్కులా ఉంటుంది. అద్భుతమైన బీచ్‌లతో ఓ పెద్ద స్విమ్మింగ్‌పూల్‌ను తలపిస్తుంది. ప్రతి ఇల్లూ స్కూలు పిల్లలు వేసుకున్న కలర్‌ఫుల్ డ్రెస్సులా ఉంటుంది. ఎంత చిన్న ఇల్లైనా ముందు ఓ వసారా, దానికో చిన్నగేటు, ఆ గేటు ముందున్న ఓపెన్ ప్లేస్‌లో కొబ్బరిచెట్లతో చూడముచ్చటగా ఉంటుంది. గోవాలో 120కి పైగా భారీ చర్చిలు, ఆరువేలకు పైగా పురాతన ఇళ్లు ఉన్నాయి. విచిత్రమైన విషయమేంటంటే గోవాలో అడుగుకో బార్ అండ్ రెస్టారెంట్ కనిపిస్తుంది. అన్నీ రద్దీగానే ఉంటాయి. కొన్నింటిలో అయితే బార్ ఓనరూ, సర్వ్ చేసేవాళ్లూ కూడా పదహారు నుంచి ముప్పయి అయిదేళ్ల వయసు స్త్రీలే. అయినా వెకిలి చేష్టలు, గొడవలు, సీసాలూ తలలు పగలడాలు లాంటివి ఉండవు! ఇక్కడ శాకాహారుల కోసం ఉడిపి హొటళ్లూ మాంసాహారులకు రకరకాల సముద్ర వంటకాలు, వెరైటీ రుచులు అందించే రెస్టారెంట్లూ ఉంటాయి.

భలే బీచ్‌లు

గోవాలో అన్ని వర్గాల వారినీ అలరించే బీచ్‌లు వున్నాయి. ఒక్కో బీచ్‌దీ ఒక్కో ప్రత్యేకత. కొబ్బరిచెట్లు కొలువుదీరింది ఒకటైతే నల్లరాళ్లలో నిండిన బీచ్ మరొకటి. అడుగడుగునా రంగు రంగుల చేపలతో పెద్ద అక్వేరియంను తలపించే బీచ్ ఒకటైతే ఆరు బయట వాలు కుర్చీలో బీర్లు తాగుతూ కుర్చునేది మరొకటి. సాయం సమయంలో ఆరుబయట చల్లగాలికి కుర్చీల్లో కూర్చుని, ఇష్టమైన వంటకాలు తింటుంటే... ఊహకందని ఫీలింగ్. అందుకే గోవాలో ఓపెన్ ఎయిర్ రెస్టారెంట్లు ఎక్కువే.

పాలోలెమ్ బీచ్... దీన్నే పారడైజ్ బీచ్ అని కూడా పిలుస్తారు. దక్షిణ గోవాలోని మార్‌గోవాకు సమీపంలో ఉందిది. సుమారు మైలు పొడవు తీరం... తీరం వెంబడి పెద్ద పెద్ద బార్లూ రెస్టారెంట్లూ కొబ్బరిచెట్లూ... విశ్రాంతి తీసుకునేందుకు చూడచక్కని పూరిగుడిసెలు... రుచికరమైన సీఫుడ్... ఇవన్నీ చూశాక, ఇది నిజంగా పారడైజ్ బీచ్ అనిపిస్తుంది. ఇక్కడ చేపలు పడతారు. అందువల్ల మత్స్యకారుల పడవల్లో పర్యాటకులు వెళ్లే వీలుంది. డాల్ఫిన్ క్రూయిజ్‌లకు పడవలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. శని, ఆదివారాల్లో మాత్రం... కుటుంబాలతో ఇటువైపు రావద్దని చెబుతారు. ఎందుకంటే ఇసుకేస్తే రాలనంత జనంతో బీచ్ అంతా నిండిపోతుందట.

దక్షిణ గోవాలో బాగా బీచ్‌లోని సంగీతం గురించి చెప్పుకోవాలి. ఎనిమిదో దశాబ్దంలోని పాప్, ఆధునిక వాయిద్యాల సమ్మిళితమైన ఆ మ్యూజిక్ వింటుంటే భలే మజాగా అనిపిస్తుంది. ఇక్కడి బార్లలో డిస్కోలు రాత్రి 10.30 గంటలకు ప్రారంభమవుతాయి. తెల్లవారి నాలుగువరకూ నాన్‌స్టాప్ హంగామా. దీని పక్కనే కాలంగూట్ బీచ్ ఉంది. ఇక్కడి నుంచి పణజికి 16 కి.మీ. ఈ రెంటిలోనూ తీరం పొడవునా కుర్చీలు వేసి ఉంటాయి. సన్‌స్క్రీన్ లోషన్ రాసుకుని ఈ ప్రపంచంతో తమకేమీ సంబంధం లేనట్లు కుర్చీల్లో నడుం వాల్చిన వాళ్లను చూస్తే అసూయగా అనిపిస్తుంది. ఇక్కడ ఇటాలియన్ షెఫ్‌లు వండే ఇటాలియన్ వంటకాలు నోరూరిస్తాయి. మండోవి బీచ్‌లో గోవా పర్యాటక శాఖతోపాటు ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే పడవలూ ఉంటాయి. సాయంత్రం సమయంలో సూర్యాస్తమయాన్ని పూర్తిగా వీక్షించేందుకు వీటిని ఏర్పాటు చేస్తారు. ఈ పడవల్లో సంగీత కార్యక్రమాలూ అలరిస్తాయి. సుమారు గంటసేపు సాగే ఈ ప్రయాణంలో వీనుల విందైన మ్యూజిక్‌ను వింటూ సూర్యాస్తమయాన్ని చూస్తుంటే సమయమే తెలీదు.

గోవాలోని హోటల్‌లో..

ఓల్డ్‌గోవాలో ఎక్కువగా అరబ్బులు, పర్షియన్లు యూదులు, మలబార్ వాసుల పడవలు కనిపిస్తాయి. ఒక్కొక్కటీ ఒక్కో రకంగా చూడముచ్చటగా ఉంటాయి. ఇక్కడి వైస్రాయ్ ఆర్చి, ఆసియాలో అతిపెద్ద చర్చిల్లో ఒకటైన సెయింట్ కేథరీన్ చూడదగ్గవి.

మూడు రాష్ట్రాల పండగలు

గోవాలో తప్పనిసరిగా చూడాల్సిన మరో ప్రదేశం స్వప్నగంధ. ఇది మహారాష్ట్ర, కర్నాటక సరిహద్దుల్లోని పశ్చిమ కనుమల్లో ఉంది. చుట్టూ ఎత్తైన కొండలు.. దూరంగా సముద్ర తీరాలు... చాలా బాగుంటాయి. మొదట దీన్ని బాస్కెట్ కోసం తవ్వారు. ఆ తరువాత ఇక్కడి వన్య ప్రాణులు, చెట్లను దృష్టిలో ఉంచుకుని సంరక్షణ కేంద్రంగా మార్చారు. ఈ ప్రాంతంలో మూడు రాష్ట్రాల ప్రజలు కలిసి ఉంటారు. ఇక్కడ ఒకరి పండుగలు, సంప్రదాయాలు అని ఉండవు. అందరూ అన్ని పండుగలూ జరుపుకుంటారు. 300 ఎకరాల విస్తీర్ణంలో ఏనుగులు, అనేక రకాల పక్షులు, జలపాతాలు, రకరకాల చెట్లు ఎంతో బాగుంటాయి.

పనాజికి 60 కి.మీ దూరంలో ఉంది భగవాన్ మహావీర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం. ఇది గోవాలోనే అతిపెద్దది. పశ్చిమ కనుమల పాద భాగంలో సుమారు 240 చ.కి.మీ విస్తీర్ణంలో ఉందీ కేంద్రం. ఏనుగులు, పులులు, లేళ్ల, జింకలు, పెద్దపెద్ద ఉడతలు ఇక్కడ చూడొచ్చు. ఇక్కడ సఫారీలకు జీపులు కూడా దొరుకుతాయి. ఈ అడవిలో ఉండేందుకు అతిథి గృహాలు కూడా ఉంటాయి.

గోవా వెళ్లడానికి నిర్దిష్ట సమయమంటూ ఉండదు. ఎప్పుడు వెళ్లినా అక్కడి అందాలను ఆస్వాదించొచ్చు. నిత్యం పర్యాటకులతో సందడిగా ఉండే గోవాలాంటి రాష్ట్రం మరొకటి లేదేమో అనిపించింది. అన్నీ ఒకేసారి చూసేస్తే అది 'బిజినెస్ ట్రిప్'లా ఉంటుందే కానీ, 'గోవా పర్యటన' కాదు. ఎందుకంటే గోవాను హడావుడిగా కాక అణువణువునా అనుభూతిస్తూ చూడాలి. అప్పుడు, ఎన్నిసార్లు చూసినా కొత్తగానే ఉంటుంది. తనివితీరనట్లే ఉంటుంది. అందుకే వీలైతే మళ్లీ వెళ్తారు.

★

వైస్రాయ్ ఆర్చి

సెయింట్ కేథరీన్ చర్చి

ఒక పసికూన కోసం ...

కథ

సిహెచ్. వి బృందావనరావు

ఇంకా అలాగే కూర్చున్నావా అరుణా. లేలే. రెడీకా. అలా వెళ్లొద్దాం. త్యాగరాయ గానసభలో మంచి భరత నాట్యం ప్రోగ్రామొచ్చింది. చూసి అలాగే హోటల్లో భోం చేసి వద్దాం' అన్నాడు రాజేంద్ర ఆఫీసు నుండి రాగానే. సోఫాలో కూచుని టీవీ రిమోట్‌తో ఛానెళ్లన్నీ కిందికీ పైకీ మారుస్తూ ఏ ఒక్క ఛానెల్ మీదా దృష్టి కేంద్రీకరించక నిర్లిప్తంగా ఉన్న అరుణ మాట్లాడకుండా, తను చేస్తున్న పని అలాగే కొనసాగిస్తూ ఉండిపోయింది భర్త మాటలు విని కూడా. రాజేంద్ర ఫ్రెషప్పయి వచ్చి సోఫాలో అరుణ పక్కనే కూచున్నాడు. ఆమె చేతిలోని రిమోట్ లాక్కుని 'లే. అలా పోయొద్దాం' అన్నాడు. అరుణ కదల్లేదు.

'లే, అరుణా. అలా వెళ్లి సంతోషంగా గడిపొద్దాం' – అన్నాడు రాజేంద్ర అనునయంగా. అరుణ అలాగే కూచుని దిగులు నిండిన కళ్లతో రాజేంద్రను చూసి మళ్లీ తల తిప్పుకుంది. 'ఏంటరుణా నువ్వు. ఒంటరిగా ఏం చేస్తాం ఇంట్లో. పోనీ ఏదైనా మంచి సినిమాకు పొయ్యొద్దాం పద' అన్నాడు.

'ఏం జాలీ అండీ. మొన్న ఏదో సంగీత ప్రోగ్రాం ఉందని పొయ్యొచ్చాం. బాగానే ఉంది. నిన్న ఏదో మేజిక్ షో అన్నారు. వెళ్లాం. సాయంకాలాలన్నీ పాటలనో, సినిమాలనో, డాన్సులనో పోయొస్తూనే ఉన్నాం. ఇంతేకదా. ఇంతకుమించి మరేమీ జీవితం లేదు కదా. నాకు మొహం మొత్తుతోంది' అంది అరుణ.

రాజేంద్ర ఏం మాట్లాడలేకపోయాడు. నిజమే. తను కూడా అలాగే అనుకుంటూ వున్నాడు. అరుణ బాధేందో తనకు తెలుసు. నిజానికి తనకూ కొరతగానే ఉంది. డబ్బులకు ఇబ్బంది లేదు. ఏ కోరికనైనా తీర్చుకోగల తాహతుంది. కానీ ఎందుకివన్నీ. తమ పెళ్లయి పదేళ్లు దాటింది. పిల్లల్లేకపోయేసరికి బతుకు నిస్తేజమైపోయింది. పూజలూ వ్రతాలూ చేశారు. మొక్కులు మొక్కారు. తీర్థయాత్రలు చేశారు. డాక్టరు చేత ఇద్దరూ పరీక్షలూ చేయించుకున్నారు. అరుణలోనూ రాజేంద్రలోనూ లోపమేమీలేదని చెప్పారు డాక్టర్లు. కానీ.. పదేళ్లదాకా గర్భం రాకపోవడానికి కారణాలను డాక్టర్లు కూడా చెప్పలేకపోయారు. 'ఇంతకాలమైనా గర్భం ధరించలేకపోయారు కాబట్టి – ఇక ఇప్పుడు వచ్చే అవకాశాలు దాదాపు లేనట్లే' అన్నారు.

రాజేంద్రా అరుణా జీవితం మీద ఆసక్తి లేనట్లు రోజులు వెళ్లదీస్తున్నారు. రాజేంద్ర క్రమక్రమంగా కోలుకున్నాడు గాని, అరుణ తన నిర్లిప్తతలోంచి బయటకు రాలేకుండా ఉన్నది. అందుకనే డాన్సు ప్రోగ్రాములనీ, సంగీత కార్యక్రమాలనీ, సినిమాలనీ ఆమె మనసును మరో రకంగా మళ్లించే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు రాజేంద్ర. ఇవ్వాళ గతమంతా మళ్లీ మరోసారి రాజేంద్ర మనసు తెరపైకి వచ్చింది. అరుణను అనునయించడానికి ప్రయత్నిం చాడు. కాని ఆమె మూడ్‌లో లేదని గ్రహించాడు.

" ఏదైనా ఆత్మీయం చేసుకోవడంలోనే ఉంది అరుణా. వీడు నావాడు అని గుండెలకు హత్తుకుని అక్కున చేర్చుకోవడంలో గొప్ప ఆనందం ఉంటుంది. నీ ప్రేమనంతా వాడికి పంచి పెట్టడంలో గొప్ప హాయి వుంటుంది. "

'పోనీ ఎవర్నన్నా దత్తత తీసుకుందామా' – అన్నాడు. అరుణ ఏమీ ఆసక్తి చూపించలేదు.

'ఏదైనా ఆశ్రమం నుంచి ఒక అబ్బాయినో, అమ్మాయినో తెచ్చుకుందామా'.

'అనాథనా' చీదర భావం ముఖంలో కనపరుస్తూ అంది అరుణ.

'అలా అనకు అరుణా. ఎవరైనా అనాథలెట్లా అవుతారు. తల్లిదండ్రులు వదిలేస్తేనో, తల్లిదండ్రులు చనిపోతేనో ఇతరులెవరూ దగ్గరికి తీయకపోతేనే కదా. అయినా మనం తెచ్చుకుని పెంచుకుంటే ... మన పిల్లవాడే అవుతాడు గదా'

'వాడి తల్లిదండ్రులెవరో తెలియదు. కులమూ, గోత్రమూ తెలీకుండా...' అనబోయింది అరుణ. 'తగలబెట్టు నీ కులాన్నీ, గోత్రాన్నీ. ఇంత చదువుకొని ఈ ఇరవయ్యొకటో శతాబ్దంలో ఇంకా కులమూ, గోత్రమూ అంటావు. అసలు నీ చదువంతా ఏమైంది' – అన్నాడు రాజేంద్ర.

'అది కాదండీ ...ఒక కుక్కను కొనుక్కునేవాడు దాని జాతినీ పెడిగ్రీనీ పరిశీలించిగాని కొనడు. గుర్రాన్ని కొనుక్కునేవాడు దాని వంశాన్నీ పంరపరనూ పరిశీలించిగానీ కొనడు. అంతెందుకు. ఒక ఎద్దునో, గేదెనో కొనేవాడు వాటి వొంటి మీద సుడులనూ, శరీర భాగాల కొలతలనూ వివరంగా చూసిగాని కొనడు. అలాంటిది, మనిషిని ఏమీ తెలియకుండా ఎలా తెచ్చుకోగలమండీ' – అంది అరుణ.

'అరుణా! మనం తెచ్చుకోవాలనుకుంటున్నది మనిషిని. జంతువును కాదు. జంతువులను ఒక ప్రత్యేక ప్రయోజనాన్ని ఆశించి తెచ్చుకుంటారు. కుక్కల్ను వేట కుక్కలుగానో, పోలీసు జాగిలాలుగానో శిక్షణ ఇవ్వడానికీ, గుర్రాలను పరుగు పందేల కోసమూ కొనుక్కుంటారు. అంతమాత్రాన వారి పరీక్షకు ఆగని జంతువులు పనికిరానివైపోతాయా. అసలు మనం తెచ్చుకునేవాడు జంతువులా కాక మనిషిలాగా పెరగాలి. మనిషిగా పెరిగేట్లు మనం పెంచుదాం' అన్నాడు రాజేంద్ర.

'ఎక్కడ పుట్టాడో, ఎలా పుట్టాడో తెలీకుండా..' నసిగింది అరుణ.

విసుగు వచ్చింది రాజేంద్రకు. 'ఎక్కడ పుడితే ఏమవుతుంది. ఇక ఎలా పుట్టాడంటావా? మనిద్దరి పరిస్థితులూ బాగుండి మనకు సంతానం పుడితే ఎలా పుట్టేవారో, అలానే పుట్టుంటాడు. అది ప్రకృతి ధర్మం. ఏ బిడ్డయినా పదినెల్లు తల్లి కడుపులో పెరిగి, ప్రాణం పోసుకుని, ఆ తర్వాత ఈ లోకంలోకి వస్తారు. అదీ ప్రకృతి ధర్మమే. ఏ పుట్టుకా అసహజమైంది కాదు. ఏజన్మా అసహ్యమైంది కాదు. కాబట్టి ఏ ఆలోచనలూ పెట్టుకోవద్దు. ఎవరో ఒక పసివాణ్ణి తెచ్చుకుందాం' అన్నాడు రాజేంద్ర.

అరుణ ఏమీ మాట్లాడలేదు. ఆలోచనలో మునిగిపోయింది. 'ఏదైనా ఆత్మీయం చేసుకోవడంలోనే ఉంది అరుణా. వీడు నావాడు అని గుండెలకు హత్తుకుని అక్కున చేర్చుకోవడంలో గొప్ప ఆనందం ఉంటుంది. నీ ప్రేమనంతా వాడికి పంచి పెట్టడంలో గొప్ప హాయి వుంటుంది. నీ సొంత గర్భంలోంచి రాకపోతేనేం – నావాడు అని మనస్సులో అనుకుంటే ప్రేమ అదే పొంగి వస్తుంది. అలా మన బతుకుల్లోకి ఒక పసిప్రాణిని తెచ్చుకుందాం. మన ప్రేమ సర్వస్వాన్నీ వాడికిచ్చి

పెంచుకుందాం. ఒక మంచి మనిషిలా వాణ్ణి తయారు చేద్దాం. సరేనా' – అన్నాడు రాజేంద్ర.

అరుణ సానుకూలమైన ఆలోచనల్లో పడింది.

రాజేంద్ర ఇదే సమయమని, ఆమెను ఒప్పించే ప్రయత్నాన్ని కొనసాగించాడు. 'ఇక మనకెలాగూ పిల్లలు కలిగే అవకాశం లేదు. మనకుండే దారులు రెండే రెండు. పిల్లల్లేక పోతే మానేలే అనుకుని ఇలానే ఉండిపోవడం ఒకటి. ఎవరో ఒక అబ్బాయినో, అమ్మాయినో తెచ్చుకోవడం ఒకటి. ఇక మనవాళ్లల్లో ఎవరి పిల్లల్నో తెచ్చుకుందామంటావా, అందరికీ ఒక కూతురో, ఒక కొడుకో అంతే. వాళ్లెవరూ ఇవ్వరు. అదీకాక మనం తెచ్చుకున్నాక వాడిమీద వాడి తల్లిదండ్రులు – తమకు రహస్య హక్కుందని భావిస్తుంటారు. ఇక నేను చెప్పినదారే మిగిలింది. బాగా ఆలోచించు'–

> **" అలా కొన్ని నెలలు గడిచిపోయాయి. ఉన్నట్లుండి అరుణకు లీలగా ఏదో అనుమానం కలిగిందిగాని దాన్ని పెద్దగా పట్టించుకోలేదు. మరికొన్ని రోజులు గడిచిన తర్వాత ఆ అనుమానం పెద్దదైంది. రాజేంద్రకు చెప్పింది. ఎందుకైనా మంచిదని డాక్టర్ని కలుద్దామనుకున్నారు ఇద్దరూ. "**

అన్నాడు రాజేంద్ర.

'ఇందాకట్నించీ మీరు చెప్తున్నదంతా వింటూ, ఆలోచిస్తూనే ఉన్నానండీ. మీరంతగా విడమరచి చెప్పిన తర్వాత – అదే మంచిదనిపిస్తుంది. ఈ ఒంటరి మోడు బ్రతుకుతో విసిగిపోయానండీ. ఇప్పుడు నాకో పాపో, బాబో కావాలి. అమ్మా అని పిలుస్తూ ఇంట్లో బుడి బుడి నడకలతో అల్లరి చేసే పసివాడొకడు కావాలి. ఈ పబ్బులూ, సినిమాలూ, డాన్సులూ, సంగీతాలూ ఇవేవీ ఇవ్వలేని తృప్తిని ఒక పసిప్రాణమైతేనే ఇవ్వగలదండీ. ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా తెచ్చుకుందాం' అన్నది అరుణ.

'రేపు ఉదయమే వెళదాం' అన్నాడు రాజేంద్ర కూడా తృప్తిగా.

ఒక బాబును తెచ్చుకొని వాణ్ణి ప్రేమగా పెంచి పెద్దవాణ్ణి చేసి డాక్టరుగానో, ఐఏయస్ ఆఫీసరుగానో చేస్తాను చూస్తుండండి –' అంది– అప్పుడే ఊహల దారాలు అల్లుకుంటూ భవిష్యత్తులోకి పోతూ అరుణ.

రాజేంద్ర నవ్వాడు. 'ఆగాగు. అంత ఆత్రపడిపోకు. ముందు వాణ్ణి ఒక మంచి మనిషిగా తయారుచెయ్యి. ఎవరైనా తనకు కష్టం కలిగితే బాధపడతాడు. తన బాధకే కాక ఇతరుల కష్టం చూసి కరిగిపోయ్యేవాడే మనిషి. ప్రతివాడూ తన కడుపు నింపుకోవడానే చూస్తాడు. ఇతరుల కడుపాకలిని గుర్తించి స్పందించేవాడే నిజమైన మనిషి. ముందు నీ కొడుకును అలాంటి మంచి మనిషిగా రూపొందించు. తర్వాత ఏ వృత్తి ఎంచుకోవాలో తనే నిర్ణయించుకుంటాడు. అంతేకాదు. వాడు పెద్దయిన తర్వాత నీకేదో చేయాలని ఆశించకు. నిస్వార్థంగా నీ వాత్సల్యాన్ని వాడికివ్వు.'– అన్నాడు. అరుణ భర్త వైపే మురిపెంగా చూస్తూ ఉండిపోయింది. గత కొన్నేళ్లుగా తనలో ఉండిపోయిన నిస్పృహ, నిరాసక్తతా కొంచెం కొంచెం కరిగిపోతుండగా.

తన కౌగిట్లో ఒక ముద్దులు మూటగట్టే పసిపాప బోసి నవ్వులనూ, మెత్తని శరీరపు కదలికలనూ, చిట్టి చిట్టి కాళ్లు, చేతుల స్పర్శనూ అనుభూతిస్తూ నిద్రకాని నిద్రలోకి ఏ అపరాత్రికో జారిపోయింది అరుణ.

మర్నాడే ఒక అనాథాశ్రమానికి పోయి ఒక ముద్దులు మూటగట్టే బాబును ఎంచుకొని, అక్కడి నియమ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకొని – బాబును తమ ఇంటికి తెచ్చుకున్నారు రాజేంద్రా, అరుణా.

అరుణకు ఆ బాబుదే లోకం అయిపోయింది. వాడిని మురిపెంగా పెంచుతూ, ఆడిస్తూ, వాడే తన సర్వస్వంగా చూసుకుంటూ, వాడితోనే రాత్రింబవళ్లూ గడుపుతూ మాతృత్వంలోని మధురిమను అనుభవిస్తున్నది. వాడు కళ్లకెదురుగా లేకుంటే క్షణం కూడాడా భరించలేకపోతున్నది. రాజేంద్ర కూడా ఇంత కాలానికి తమ ఇంట్లో ఒక పసివాడు ముద్దులు చిందిస్తూ తమ బతుకులను కొత్త పరిమళంలో నింపుతున్నట్లు పొంగిపోతున్నారు. పదేళ్లుగా తపించిన తమ బతుకుల మీద ఒక శ్రావణ మేఘం వర్షించి తమ మోడు జీవితాల్లోకి ఒక పచ్చని వసంతాన్ని తెచ్చినట్లు పులకరించి పోసాగారు ఆ దంపతులిద్దరూ.

అలా కొన్ని నెలలు గడిచిపోయాయి. ఉన్నట్లుండి అరుణకు లీలగా ఏదో అనుమానం కలిగిందిగాని దాన్ని పెద్దగా పట్టించుకోలేదు. మరికొన్ని రోజులు గడిచిన తర్వాత ఆ అనుమానం పెద్దదైంది. రాజేంద్రకు చెప్పింది. ఎందుకైనా మంచిదని డాక్టర్ని కలుద్దామనుకున్నారు ఇద్దరూ.

ఏం వినాల్సొస్తుందోననే ఆసక్తితోనూ, ఆత్రుతతోనూ ఎదురుచూస్తున్న ఆ దంపతులను చూస్తూ 'మీరు తల్లి కాబోతున్నారు' అని అరుణతో చెప్పింది డాక్టరు, లాబ్‌లోంచి బయటికి వస్తూ. ఇద్దరి మనసుల్లోనూ చాలా ఆనందం కలిగింది ఇద్దరూ సంతోషంగా బయటికి వచ్చారు.

'అబ్బ! ఎంత ఆనందంగా వుందో. పదేళ్లయి, ఇక లాభం లేదనుకుని ఆశలు వదులుకున్న తర్వాత – అనుకోకుండా ఇలా జరగడం ఎంతో సంతోషంగా ఉందండీ' అంది అరుణ.

రాజేంద్ర ఆలోచనలు వేరుగా వున్నాయి. ఎంతో ప్రేమతో పెంచుకుంటున్న అనాథ పిల్లాడి మీద – తన సొంత సంతానం పుట్టిన తర్వాత అరుణ అదే ప్రేమ చూపించగలదా అసహనమూ, నిరాసక్తతా పెంచుకోదుగదా. అనుక్షణం తన సంతానంతో పోల్చి చూసుకుంటూ వాడిని చీదరించుకోదు గదా' అని సందేహపడుతున్నాడు.

'ఏం మాట్లాడరేమండీ. మీకు సంతోషంగా లేదా' అని అడిగింది.

'ఎందుకు లేదు. సంతోషమే' అన్నాడు రాజేంద్ర పొడిగా.

'మీరు అదోలా ఎందుకున్నారో నాకు తెలుసు. మీ అనుమానం ఏమిటో నాకు అర్థమైంది. నాకు పిల్లో పిల్లాడో పుట్టిన తర్వాత పెద్దబాబును సరిగ్గా చూస్తానో లేదోనని అనుమానిస్తున్నారు గదూ.. నిజానికి వాడు మనింట్లోకి వచ్చిన తర్వాత నాకు కడుపు పండింది. వాడు మనపాలిట అదృష్ట దేవత. నాకన్న బిడ్డకూ వాడికీ తేడా చూపేంత దుష్టురాలిని కాదండీ. నిజానికి వాడు నా కన్నబిడ్డ కాదనే ఊహ కూడా నా మనసులోకి రాదండీ' అన్నది అరుణ.

రాజేంద్ర ప్రసన్నుడైనాడు కానీ– అతని అనుమానం పూర్తిగా సమసిపోలేదు. ఇది అదృష్ట దురదృష్టాల సమస్యగాదు. ఇవ్వాళ అదృష్టదేవతగా కనిపించినవాడు రేపు ఏ పొరపాటైనా జరిగితే శని దేవతగా భావింపబడే అవకాశం ఉంది. ఇది కేవలం అరుణ హృదయ వైశాల్యానికి సంబంధించిన అంశం– అనుకుంటున్నాడు.

'మీ అనుమానం పూర్తిగా పోయినట్లు లేదు. మీకు నమ్మకం కలగడానికి ఏం చెయ్యమంటారో చెప్పండి. నా గర్భం తీసేయించుకోటానికైనా నేను సిద్ధమే – అన్నది అరుణ.

'ఛ ఛ.. అలా అనకు అరుణా. నీ మాతృత్వ భావ పరిపూర్తికీ, ప్రసవానందానికీ – నిన్ను దూరం చేస్తాననుకున్నావా. మన పెద్దవాడి మీద ప్రేమ అలాగే ఉంచుకో చాలు' అన్నాడు ఆర్ద్రంగా రాజేంద్ర. అరుణ చేతిని తన చేతుల్లోకి తీసుకొని ఎంతో మెచ్చుకోలుగా నిమిరి –'పద' అన్నాడు. కారు మెత్తగా కదిలింది.

■ ఫోన్: 91776 18708

నవ్వుల్ – పువ్వుల్

మూర్ఖులు



రాము : అంత పరిగెత్తుతూ వస్తున్నావ్... ఎవరికి ఏం చెప్పడానికి?

గోపి : నేను ఏ విషయాన్నైనా మూర్ఖులకే చెబుతాను... అందుకే నీ దగ్గరకు పరిగెట్టుకు వస్తున్నా...!

అందం



కిశోర్ : అద్దం ముందు నించుని తదేకంగా చూస్తున్నావేంరా....?

చంద్ర : నేను అందంగా ఉన్నానా, అద్దంలో ఉన్నది అందంగా ఉందా.... అని..!

చుట్టాలు

కొడుకు : కాకి అరిస్తే ఎవరొస్తారు నాన్నా....?

తండ్రి : చుట్టాలు వస్తార్రా...!

కొడుకు : మరి మొన్న చుట్టాలు రాలేదు గానీ, మరో కాకి వచ్చిందేం?!

తిట్లు



బాలు : వాడ్ని ఎన్ని రకాలుగా తిట్టినా, ఇంకా తిట్టమంటున్నాడేంట్రా...?

అనీల్ : వాడికి బ్రహ్మచెముడు... అందుకని!

మరో డాక్టరా!



సోమయ్య : ఇప్పుడే ఆ డాక్టర్ దగ్గరకు వెళ్లి వచ్చావు... మళ్లీ వేరే డాక్టర్ దగ్గరకు ఎందుకు పరిగెడతావ్....?

వెంకయ్య : మొదటి డాక్టర్ వేసిన బిల్లుకు... గుండెనొప్పి వచ్చింది. ఇప్పుడు హార్ట్ స్పెషలిస్ట్ దగ్గరకి వెళుతున్నా...!

దొంగతనం

సురేష్: పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వస్తున్నావా... ఎందుకు...?

రమేష్: నేను రెండ్రోజులు ఊరెళ్లాను. ఈ రెండ్రోజుల్లో మా ఇంట్లో ఎవరైనా దొంగలు పడ్డారో లేదో తెలుసుకుందామని...!

మత్తు లేకుండానే

శీను : మీ ఆవిడకు మత్తు ఇవ్వకుండానే ఆపరేషన్ చేశారట... ఎలా సాధ్యమయింది...?

వెంకట్రావు : ఆ సమయంలో ఆవిడకు కొనబోయే చీరలు, నగలు గురించి చెబుతూ ఉన్నాను... అలా...!

ఫలహారం



రామం : పెళ్లిలో ఫలహారం పెట్టారా...?

సూర్యం : నాకయితే ఏ ఫలమూ పెట్టలేదు, మా ఆవిడకైతే హారం అంతకన్నా పెట్టలేదు...!

తర్వాతే...



రోగి : నాకు మత్తు మందు ఇచ్చి ట్రీట్‌మెంట్ మొదలు పెట్టండి డాక్టర్ గారూ...!

డాక్టర్ : అలాగే నీవు ఫీజు కట్టిన వెంటనే మత్తు మందిచ్చేస్తా...!

కోర్సు



టీచర్ : కామర్స్ అంటే ఏమిట్రా....?

స్టూడెంట్ : కామ్‌గా ఉండే కోర్స్ సార్....!

శబ్ద కాలుష్యం



సుధ : పెళ్లికొడుకు, పెళ్లిలో పురోహితుడిని కూడా వద్దంటున్నాడా అదేం....?

రాధ : అతను లైబ్రేరియన్‌గా పని చేస్తున్నాడట, తనకు సౌండ్ పొల్యూషన్ పడదట... అందుకని...!

కొలత



డాక్టర్: నీకు యాక్సిడెంట్ వల్ల అయిదు లీటర్ల రక్తం పోయిందయ్యా....!

పేషెంట్ : లేదండీ, మీరు సరిగ్గా కొలిచి ఉండరు. అది నాలుగు లీటర్ల రక్తమే ఉంటుంది...!

- ముత్యాల శ్రీశరత్‌బాబు,

ఫోన్ నెం : 9963298921

దసరా స్పెషల్స్

బటర్ చికెన్

కావలసిన పదార్థాలు : చికెన్ : ముప్పావు కిలో, పుల్లటి పెరుగు : టేబుల్ స్పూన్, నిమ్మరసం : టేబుల్ స్పూను, ఉల్లిపాయ : ఒకటి, కారం : రెండు టీ స్పూన్లు, అల్లం వెల్లుల్లి : 2 టీ స్పూన్లు, వెన్న : 5 టేబుల్ స్పూన్లు, మీగడ : 2 టేబుల్ స్పూన్లు, టొమాటోలు : నాలుగు, టొమాటో సాస్ : టేబుల్ స్పూన్, గరం మసాలా : టీ స్పూను, పచ్చిమిర్చి : నాలుగు, పసుపు : అరటీ స్పూను, జీలకర్ర పొడి : 2 టీ స్పూన్లు, ధనియాల పొడి : 2 టీ స్పూన్లు, ఉప్పు : రుచికి సరిపడా, కొత్తిమీర తురుము : టేబుల్ స్పూను.

తయారుచేసే విధానం : చికెన్‌ను శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కోయాలి. తరువాత ముక్కలకు మసాలా పట్టేలా చాకుతో గాట్లు పెట్టాలి. ఉల్లిపాయ ముక్కల్ని ముద్దలా నూరాలి. పుల్లటి పెరుగు, నిమ్మరసం, ఉల్లి ముద్ద, అల్లం వెల్లుల్లి ముద్ద, కారం అన్నీ కలపాలి. ఈ మిశ్రమాన్ని చికెన్ ముక్కలకు పట్టించి ఓ రాత్రంతా ఫ్రిజ్‌లో ఉంచాలి. సన్నగా తరిగిన టొమాటోలు, టొమాటో సాస్, గరం మసాలా, సన్నగా తరిగిన పచ్చిమిర్చి, పసుపు, జీలకర్ర పొడి, ధనియాల పొడి అన్నీ బాగా కలిపి సాస్ తయారు చేయాలి. బాణలిలో వెన్న వేసి కరిగిన తరువాత చికెన్ ముక్కల్ని వేసి మెత్తగా ఉడికే వరకూ ఉంచాలి. మరో బాణలిలో సాస్ మిశ్రమంలో కొంత మీగడ వేసి తక్కువ మంట మీద ఉడికించాలి. తరువాత ఇందులోనే చికెన్ ముక్కల్ని వేసి కాసేపు ఉడికించి దించాలి. చివరగా కొత్తిమీర తురుము, మిగిలిన మీగడ కూడా వేసి కలపాలి.

బియ్యం, పెసరపప్పు పొంగలి

కావలసిన పదార్థాలు : బియ్యం : గ్లాసు, పెసరపప్పు : పావు గ్లాసు, నేతిలో వేయించిన జీడిపప్పు, ఎండుద్రాక్ష పలుకులు : పావుకప్పు, బెల్లం : రెండు కప్పులు, పాలు : గ్లాసు, యాలకుల పొడి : అరచెంచా.

తయారీ విధానం : బియ్యం, పెసరపప్పును శుభ్రంగా కడిగి రెండున్నర గ్లాసుల నీళ్లు చేర్చి మెత్తగా ఉడికించుకోవాలి. అందులో బెల్లం తురుము వేసి మరి కాసిని నీళ్లు, పాలు చేర్చి మళ్లీ సన్నని మంటపై పెట్టాలి. బెల్లం పూర్తిగా కరిగి పొంగలి దగ్గరగా అవుతున్నప్పుడు యాలకుల పొడి, ఎండు ద్రాక్ష, జీడిపప్పు పలుకులు చేర్చి బాగా కలిపి దింపేయాలి. దీన్ని మరో పాత్రలోకి తీసుకుంటే చాలు.

మినప గారెలు

కావల్సిన పదార్థాలు : మినపప్పు : ఒక కిలో, జీలకర్ర : ఒక టీ స్పూన్, మిరియాలు : ఒక టీ స్పూను (పొడి చేసుకోవాలి), అల్లం ముక్కలు : ఒకటిన్నర టీ స్పూన్లు, పచ్చి మిరపకాయ ముక్కలు : ఒకటిన్నర టీ స్పూన్లు, కరివేపాకు : రెండు రెబ్బలు, ఉప్పు : రుచికి తగినంత, నూనె : వేయించడానికి తగినంత.

తయారు చేసే పద్ధతి

మినపప్పు కనీసం మూడు గంటలసేపు నానబెట్టి, నీటిని ఒంపేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఆ తరువాత జీలకర్ర, మిరియాలు, అల్లం, పచ్చి మిరపకాయలు, కరివేపాకు, ఉప్పు కలపాలి. అరచేతిలో నొక్కి బంగారు రంగు వచ్చేవరకు వేయించి చట్నీ లేదా సాంబారుతో కలుపుకుని తినాలి.

మటన్ సుక్కా

కావలసిన పదార్థాలు : మటన్ : అరకిలో, ఉల్లిపాయ ముక్కలు : ఒక టేబుల్ స్పూను, అల్లం వెల్లుల్లి ముద్ద : ఒక టీ స్పూను, కారం : ఒక టీ స్పూను, నువ్వుల పొడి : ఒక టీ స్పూను, గసగసాలు : ఒక టీ స్పూను, పల్లీల ముద్ద : రెండు టీ స్పూన్లు, మొక్కజొన్న పిండి : ఒక టేబుల్ స్పూను, గరం మసాలా : రెండు టీ స్పూన్లు, కొత్తిమీర : ఒక కట్ట, పుదీన : ఒక కట్ట, ఉప్పు : తగినంత, నూనె : సరిపడా.

తయారుచేసే విధానం : మటన్‌ని శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. మిక్సీ గిన్నెలో ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి ముద్ద, నువ్వుల పొడి, గసగసాలు, పల్లీల ముద్ద, మొక్కజొన్న పిండి, గరంమసాలా, ఉప్పు, కారం, కొద్దిగా నీళ్లు పోసి రుబ్బుకోవాలి. ఈ ముద్దను మటన్‌లో కలిపి ఒక పావుగంట నానబెట్టాలి. ఆ తరువాత మటన్ ముక్కల్ని ఎండలో పెట్టాలి. బాగా ఎండాక స్టౌమీద మందపాటి గిన్నె పెట్టి సరిపడా నూనె పోసి కాగాక ఎండపెట్టిన మటన్ ముక్కల్ని వేసి ఎర్రగా వేయించాలి. చివర్లో కొత్తిమీరతో అలంకరించాలి.

చరితార్థుల సందర్శన

ఈ దేశంలో ముస్లింలు దేశం కోసం ప్రాణాలర్పిస్తారని ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలకు విశేష ప్రచారం లభించింది. వారెలాంటి పరిస్థితుల్లోనూ అల్‌ఖైదా వంటి వాటి వెంట వెళ్లబోరని ఆయన అమిత విశ్వాసంగా చెప్పారు. ఈ వ్యాఖ్యలు ఆహ్వానించదగినవే. అయితే ప్రత్యేకంగా అలా చెప్పాల్సి రావడం, అదేదో గొప్ప విషయంగా భావించబడటమే ఇక్కడ విచిత్రం. తమ తప్పును తామే దిద్దుకోవడం కోసం, కనీసం దిద్దుకున్నట్టు కనిపించడం కోసం మాత్రమే మోడీ అంత స్పష్టంగా ఆ వ్యాఖ్యలు చేశారనేది ఎవరికైనా అర్థమవుతుంది.ఒకే దేశం ఒకే జాతి ఒకే ప్రజ అంటూ భిన్నత్వంలో ఏకత్వాన్ని తోసిపుచ్చి ఈ దేశ చరిత్రకు హిందూత్వ భాష్యం చెప్పే సంఘ పరివార్ నిర్వాకం వల్ల చాలా అపోహలు పెరిగాయి. మరీ ముఖ్యంగా బాబరీ మసీదు విధ్వంసం తర్వాత గత రెండు దశాబ్దాలలోనూ ఒక పద్ధతి ప్రకారం మొదలైన ముస్లిం వ్యతిరేక ప్రచారం గుజరాత్ మారణహోమంతో పరాకాష్టకు చేరింది. అప్పుడు అక్కడ అధికారం వెలగబెట్టిన మోడీనే ఇప్పుడు దేశాధినేత అయ్యారు. ఆ ప్రచారాలూ మరింత ప్రబలాయి. అంతర్జాతీయంగానూ 9/11 తర్వాత ముస్లింలు అంటేనే టెర్రరిస్టులు అన్న ప్రచారం అమెరికా సాగిస్తున్నది. ఆ దేశ అధికార వ్యవస్థ ప్రతినిధిగా వున్న శామ్యూల్ హంటిగ్గన్ వంటి వారు నాగరికతల యుద్ధం పేరిట మతాల మధ్యయుద్ధమే ఇక చరిత్ర అని సూత్రీకరించారు. ఆ అమెరికా అంతర్జాతీయ ఆధిపత్య వ్యూహాలనూ రణదాహాలనూ విస్మరించి వారితో చేతులు కలపడానికి పాలకులు తహతహలాడుతున్నారు. ఇలాటి నేపథ్యంలో భారతదేశంలోని ముస్లింల పట్ల అపార్థాలు తొలగించడం, దేశాభివృద్ధిలో వారి చారిత్రిక పాత్రను గుర్తు చేయడం జాతీయ సమైక్యతా కర్తవ్యం. ముస్లింలకు సంబంధించిన వివిధ చారిత్రికాంశాలపై నిరంతరాయంగా రచనలు పరిశోధనలు చేసే సయ్యద్ నశీర్ అహ్మద్ అందుకోసమే చరితార్థులు పేరిట ఒక ఆకర్షణీయమైన సమాచార సంపన్నమైన పెద్ద పుస్తకం తీసుకొచ్చారు. ఎ 4 సైజులో దాదాపు 350 పేజీలున్న ఈ పుస్తకంలో ఆయన ముందు మాటలూ అనుబంధాలు పోగా 155 మంది ముస్లిం యోధుల ప్రముఖుల జీవిత విశేషాలు, పూర్తి పేజీ చిత్రాలు పొందుపర్చారు. ఒక పేజీలో పూర్తి చిత్రం ఇస్తూ వెనక వైపున వారి జీవిత విశేషాలు తెలుగు ఇంగ్లీషు భాషల్లో ప్రచురించారు. వారి చిత్రాలూ, వెనక ఇచ్చిన చరిత్ర కూడా ప్రామాణికంగానూ ఆకర్షణీయంగానూ వుండేలా శ్రద్ధ తీసుకున్నారు. ఆ విధంగా ఇదొక అరుదైన ఆకరంగా ఉపయోగపడుతుంది.

బ్రిటిష్ వారు వచ్చేనాటికి ఈ దేశాన్ని పాలిస్తున్నది సిరాజ్ ఉద్‌దౌలా. సైన్యాధిపతి మీర్‌జాఫర్ చేసిన ద్రోహం వల్ల ఆయన వారి చేతిలో ఓడిపోయి చివరకు ప్రాణాలే కోల్పోయాడు. మీర్‌జాఫర్ తర్వాత ఆయన మేనల్లుడైన మీర్ ఖాసింను వారు గద్దెపై కూచోబెట్టినా అతను కొద్ది కాలంలోనే వారికి ఎదురు తిరిగాడు. తర్వాత ప్రసిద్ధి గాంచిన మైసూరు వీరులు హైదరాలీ, ఆయన కుమారుడు టిప్పు సుల్తాన్‌లు పోరాడారు.ఇంకా అనేక మంది స్థానిక రాజులు



చరితార్థులు, రచయిత: సయ్యద్ నశీర్ అహమ్మద్, పేజీలు : 352, ధర : రూ. 1000/- ప్రతులకు : ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, 3-506, అప్నాఘర్, ఉండవల్లి సెంటర్ - 522501, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 9440241727.

కూడా పోరాడారు. కర్నూలు నవాబు గులాం రసూల్ ఖాన్ బ్రిటిష్ వారికి తలవంచేందుకు నిరాకరించి పోరాడి ఖైదు చేయబడి అక్కడే చనిపోయాడు.ఇలా ఆ నాటి ముస్లిం ప్రభువుల గురించి రాసిన తర్వాత చివరి చక్రవర్తి బహదూర్‌షా జఫర్. ఆ దశలో పోరాడిన వారిలో ఒకరు అవధ్ రాజమాత బేగం హజ్రత్ మహల్.ఇలాటి వారందరి గురించి రచయిత ఆసక్తిగానూ వాస్తవికంగానూ సమాచార మందించారు.

స్వాతంత్ర పోరాటంలో గాంధీజితో పాటు పాలు పంచుకున్న అలీ సోదరులు, సరిహద్దు గాంధీ ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్,బెలూచీ గాంధీ ఖాన్ అబ్దుల్ సమద్ ఖాన్, తర్వాత కాలంలో విభేదించినా మొదట ముఖ్య పాత్ర వహించిన మహ్మదాలీ జిన్నా, నేతాజీ సైన్యంలో పోరాడిన యోధులు షా నవాజ్ ఖాన్, అబ్దుల్ కరీం గని, హబీబుర్రహమాన్ ఖాన్, కాకొరి యోధుడు అష్పబుల్లా ఖాన్, హైదరాబాద్ సంస్థానంలో నేలకొరిగిన సోయబుద్దీన్, అనేక మంది సంస్కర్తలు విద్యావేత్తలు, ఇక్బాల్, నజ్రుల్ ఇస్లాం వంటి కవుల గురించి తెలుసుకుంటాము. రాష్ట్రపతులుగా పనిచేసిన జకీర్ హుస్సేన్, ఫకృద్దీన్ అలీ అహ్మద్ వంటివారు తొలి జీవితం గురించి కూడా తెలుస్తుంది. ఈ పుస్తకంలో మౌసమా బేగం, బేబీ అబూస్సలాం, అసాన్ బేగం కిద్వాయ్ వంటి ఎందరో ముస్లిం మహిళల చైతన్యం పోరాటం గురించి తెలుస్తుంది. మొత్తం... మంది మహిళల వివరాలు చిత్రాలున్నాయి. స్వాతంత్ర పోరాటంతోనే సంతృప్తి చెందకుండా సామ్యవాద ఆశయ సాధనకు అంకితమైన అనేక మంది ముస్లిం వీరులను నేతలను కూడా నశీర్ అహ్మద్ పొందుపర్చారు.భారత దేశంలో కమ్యూనిస్టు భావాలు తీసుకురావడానికి కారకులైన షౌకత్ ఉస్మానీ (అసలు పేరు మీర్ బక్స్) ముజఫర్ అహ్మద్, తర్వాతి కాలంలో ఫరూఖి, హజ్రాబేగం, మగ్దూం మొహియుద్దీన్ వంటివారిని గురించి కూడా సముచితంగా రాసేందుకు ప్రయత్నించారు.అచ్చు తప్పులు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

విషయ విస్తృతి రీత్యా దేశంలోని ముస్లిం ప్రముఖులందరి సమాచారం అందులోనూ చిత్రాలతో సహా ఒకే సంపుటంలో వస్తుందని భావించలేము. అయితే వున్న మేరకు సంక్షిప్త సమగ్రంగా ఇచ్చేందుకు చాల శ్రమ పడ్డారు. చిత్రాలు నలుపు తెలుపులో వున్నా ముద్రణ నాణ్యంగా వుంది. దాతల నుంచి తగినంత సహకారం లభిస్తే ముందు ముందు రంగుల్లో కూడా తీసుకురావచ్చు. అలాగే ఈ సంపుటిలో రానివి రావలసినవి ఇక మరో సారి సంపుటీకరిస్తారని ఆశించాలి.ఈ పుస్తకం వెల వెయ్యి రూపాయలు. ఇంగ్లీషులో కూడా సమాచారం ప్రచురించారు గనక అందరికీ ఉపయోగకరమే. ముందు మాటలు రాసిన ఆచార్యులు షంషుల్ ఇస్లాం, వకుళాభరణం రామకృష్ణలు పుస్తకం వెలువడుతున్న నేపథ్యాన్ని, చరిత్ర పట్ల శాస్త్రీయ దృక్పథం వుండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడం సముచితంగా వుంది. గతంలో ముస్లిం ల పోరాటాలు, 1857లో ముస్లింలు, ముస్లిం మహిళలు, అష్పబుల్లాఖాన్,టిప్పుసుల్తాన్,అక్షర శిల్పులు, ముస్లింయోధులు, స్వాతంత్రోద్యమంలో ముస్లింలు, ఆంధ్ర ప్రదేశ్ ముస్లింలు పుస్తకాలను కూడా వెయ్యి రూపాయలకు అందించే ఏర్పాటుప్రకటించారు రచయిత. దేశ చరిత్రను మతైక దృష్టితో చిత్రించి మైనార్టీలను దూరం చేసుకోవడం ఎంత అనర్థదాయకమో అవివేకమో ఈ పుస్తకాలు చెబుతాయి.

- తె.ర

మధ్య తరగతి కుటుంబాల జీవన చిత్రణ

టి.ఎస్.ఎ కృష్ణమూర్తి కథలు (2003), అడ్డదారులు (2006) – కథా సంపుటి : కొత్త బంగారు లోకం (నవల), కలువ విరిసింది (నవల) ఈ గాలి నాది – ఈ నేల నాది (2010) – ఘటోద్గజపురం గాథలు (2011 కథలు) దృశ్యకావ్యం : టి.ఎస్.ఎ కథ 2012 చిత్తూరు జిల్లా – వందేళ్ల కథా సారథులు లాంటి పుస్తకాలు ప్రచురించి తెలుగు విశ్వవిద్యాలయ ఉత్తమ గ్రంథ పురస్కారం పొందిన కృష్ణమూర్తి గారి తాజా కథా సంకలనం (2013 ఎస్.ఎ. కథ. ఈ సంపుటిని బి. శివశంకర్‌కు అంకితం చేశారు. వీరు ఇన్ఫోసిస్ ఉద్యోగి. 5 కథలు : 1 నాటిక ఉన్న ఈ కథా సంపుటిలో అస్త్ర సన్యాసం : అందరూ బాగుండాలి కదా! అదేమిటో!

శుభాకాంక్షలు – ప్రవృత్తి కథలు కాగా : బదిలీ (నాటిక) ప్రచురించబడ్డాయి. ఈ కథలు ఆంధ్రభూమి, రచన : స్వప్న : కథాకేళి, ఆలోచించిండి పత్రికల్లో



టి.ఎస్.ఎ కథ 20103, కథకులు : కృష్ణమూర్తి టి.ఎస్.ఎ, పేజీలు : 88. వెల : 72/- రూ, ప్రతులకు : రచయిత పేరుతో 3-169-16, రామారావు కాలనీ, బాపూజీ మున్సిపల్ స్కూల్ దక్షిణపు వీధి - మదనపల్లె- 517325. చిత్తూరు జిల్లా. సెల్ : 9347298942.

ప్రచురణై బహుమతులు పొందాయి. అన్ని కథల్లో చదివించే గుణం ఉంది. ఆంధ్రభూమి వీక్లీ కథల పోటీలో బహుమతి వచ్చిన కథ 'అస్త్ర సన్యాసం తప్పు కద?!" (పేజీ. 9) అక్రమ సంపాదనపై ఎసిబి దాడులు చేయనున్నదన్న ముందస్తు వార్తకు స్పందించి బంగారం కూతుళ్లకు కోడళ్లకు పంచాడు దయానంద్. (రామ్మూర్తి అనే కొలీగ్ ఫోన్ ద్వారా జాగ్రత్తలు చెప్పడం వల్ల.) మిత్రులకు... నమ్మినవాళ్లకు... మొయ్యగలిగినంత మేర వడ్డీలేని డిపాజిట్లలా నల్ల నిల్వలందించి నెత్తిమీద బరువు దించుకోవడం... కొండలు కరిగినా! గుట్టలు మిగిలే ఉండటం వల్ల...రాజారావు అనే ఆఫీసు గుమాస్తా సలహా మేరకు ఆ నల్లధనాన్ని, రైతుకు, పూజారికి, హొటల్ వర్కర్‌కు (రూంబాయ్) ఇవ్వడం... ఫ్యాక్టరీ యజమానికి సహాయం... ఉద్యోగాన్ని వదులుకో యత్నాన్ని (రాజీనామాను) రాజారావు విరమింపజేసి... కార్యాలయాలకు తిరిగే దేవుళ్లకు తోడ్పడాలంటాడు.... (బాధితులే దేవుళ్లు) తమిళ హీరో రజనీకాంత్ స్టైల్ సినిమా 'కథలా' ఉంది. అవినీతిపరుడు అయిన ఆఫీసర్ గుమాస్తా మాట వినడం నాటకీయతగానే ఉంది. అన్ని కథల్లో రాజారావు పాత్ర పేరు వుంది. (ప్రవృత్తి కథలోనూ) పునరుక్తిలా అనిపిస్తుంది. మరో కథ "అందరూ బాగుండాలి కద.." కూడా అచ్చ తెలుగు సినిమా కథే... రాజారావు అనే మెకానిక్ ఓ యువతి ఇంటికి వాషింగ్ మిషన్ రిపేర్‌కు వెళ్లడం... స్కూటర్ పెట్రోల్ డబ్బు అడగడం... ఆమె కంపెనీ వారికి చెప్పడం... అతన్ని ఉద్యోగంలోంచి కంపెనీ వాళ్లు తొలగించడం... పట్టుదలగా మరో షాపు అతను తన భార్య సహకారంతో పెట్టడం... అదే షోరూంకు తనపై కంప్లైట్ ఇచ్చిన ఆమె రావడం... ఆమెకు బహుమతి ఇవ్వడం ఆమె చీరల వ్యాపారాలు చేయడం... ఆర్థిక బాధల్లో ఉండటం.. రాజారావు తోడ్పడడం... అమలిన శృంగారంగా ఈ కథ నడిపారు కానీ... సినిమా ట్రిక్‌గా ఉంది.... అన్నీ కథలే ప్రచురిస్తే బాగుండేది. నాటకంలో కూడా రాజారావు పేరుతో పాత్ర వుంది... 'ఏకాంకిక' నాటిక ఇది... పోలీస్ డిపార్టుమెంట్‌పై రాసింది. అన్ని కథలూ మధ్యతరగతి జీవులకు ప్రతీకలుగా ఉన్నాయి.

-ప్రసన్న కుమారి

అనుభవాల సారం 'వృద్ధుల ఆరోగ్యం'

ప్రగతి బాటలో పయనించాలంటే 'పూర్వ' విజ్ఞానం అవసరం. గత అనుభవాల ఆధారంగానే భవిష్యత్తును నిర్మించుకోగలం. అనుభవాలను ఎంత బాగా వినియోగించుకుంటే అంత భద్రమైన భవిష్యత్తును పొందగలం. ఈ నేపథ్యంలోనే వారసత్వం అనేది మనిషి జీవితంలోనూ, సామాజిక గమనంలోనూ అత్యంత కీలకమైనదిగా ఉంది. ఇంతటి విలువైన వారసత్వాన్ని వాత్సల్యపూర్వకంగా మనకు అందించే వారే వృద్ధులు.

వృద్ధులంటే... తాతాబామ్మలు, అమ్మానాన్నలు. వారి నుంచే ఊపిరి పంచుకున్న మనం వారి ఆచరణలు,



వృద్ధులు - ఆరోగ్యం, రచన : డాక్టర్ నాగినేని భాస్కరరావు, పేజీలు : 160, వెల : రూ.100/-, ప్రచురణ : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

అనుభవాల ఆధారంగానే భవిష్యత్తులోకీ వెళుతున్నాం. ఆవిధంగా వారు మన జీవితంలో అత్యంత ప్రాధాన్యత గలవారిగా ఉన్నారు. అందుకే వారిని అపురూపంగా చూసుకోవాలి. సగౌరవంగా ఆదరించాలి. అదరించడమంటే సత్కరించడమో...మరోటో కాదు... రుగ్మతలు లేని ప్రశాంత జీవనం కల్పించడమే. వృద్ధాప్యంలో వీరు ఎలాంటి చీకూచింతా లేకుండా మనకు అనుభవాలను అందించేవిధంగా మలచుకోవడం ఎలా? వారికి ప్రశాంత జీవనం కల్పించడం ఎలా? అన్న విషయాన్ని చెప్పడం కోసమే ఈ పుస్తకాన్ని రాశారు డాక్టర్ నాగినేని భాస్కరరావు. వైద్యంలో ముఖ్యంగా వృద్ధాప్యంపై స్పెషలైజేషన్ చేసిన ఆచార్య నాగినేని 'వృద్ధులను మేధోపరంగా చైతన్యవంతంగా ఉంచాలంటే ఏం చేయాలో? అని వారసులకు, తమను తాము ఆరోగ్యంగా వుంచుకోవడం ఎలాగో? వృద్ధులకూ ఇందులో సూచనలందించారు. కుటుంబసభ్యులు వృద్ధులతో ఎలా మసలుకోవాలి? ఎలాంటి సహాయ సహకారాలు అందించాలి? ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో చెబుతూనే వారి ఆరోగ్య, చికిత్సలు, జాగ్రత్తలపై శాస్త్రీయంగా వివరించారు. అంతేకాదు వృద్ధులపట్ల సమాజం ఎలా ఉండాలో కూడా సూచించారు. వీరి పట్ల ప్రభుత్వ బాధ్యతలూ చర్చించారు. శాస్త్రీయ పరిజ్ఞానానికి తన సామాజిక అనుభవాలను తోడు చేసి అందరికీ, అన్ని రంగాలవారికీ వృద్ధుల పట్లా, వృద్ధాప్యం పట్లా సరైన మార్గనిర్దేశనం చేశారు డాక్టరు గారు. జబ్బులను దూరం పెడుతూ, రుగ్మతలు దరిచేరకుండా జీవితాన్ని పొడిగించుకుంటూ తదుపరి తరాల వారికి వారసత్వసంపదను అందించేటందుకు వృద్ధులకూ, వారి జీవనసారాన్ని ప్రగతికోసం ఉపయోగించుకోవడానికి ఇతరులకూ పనికి వస్తుందీ పుస్తకం. అందుకే వృద్ధులున్న ఇంట్లోనూ, లేని ఇంట్లోనూ ఇది తప్పక ఉండవలసిన పుస్తకం.

-ఎన్ .మదనయ్య

మన 'మలాలా'లు

ఎర్రదండు

బాలికా విద్య, మహిళల హక్కులకోసం అలుపెరగని పోరు సాగిస్తున్న యువతి మలాలా! పసివయసులోనే ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఈ పదిహేడేళ్ల అమ్మాయి జీవితం ఎందరికో స్ఫూర్తినిస్తోంది. మలాలా ఒక్క పాకిస్తాన్‌లోనే కాదు. మన దేశంలోనూ...మన చుట్టూ కూడా వున్నారు. ఆడపిల్ల చదువుకోసం, మహిళల హక్కులకోసం, సాధికారత కోసం పోరాడుతూనే వున్నారు. అలాంటి ఆరుగురు నిత్యస్ఫూర్తి ప్రదాతలు ఇవాళ మన ముందుకొచ్చారు.

పాఠాలు చెబుతున్న రంగీలా

వెర్రి వేషాలేస్తే ఎర్రదండు ఊరుకోదు!

ఉషా విశ్వకర్మ, లక్నో.

లక్నోలో 'రెడ్ బ్రిగేడ్' (ఎర్ర దండు) పేరు చెప్తే చాలు. వెర్రి వేషాలు వేసేవారు ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారు. అలాగని ఈ దండులో కండలు తిరిగిన వీరులు లేరు. అంతా 14 నుంచి 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలే. గతంలో వేధింపులకు గురయినవారే. పాతికేళ్ల ఉషా విశ్వకర్మ వీరి నాయకురాలు. నిజానికి ఉష కూడా అత్యాచార బాధితురాలే. తృటిలో ఆ ఘోరం నుంచి బైటపడ్డా... ఘటన తాలూకు దుష్ప్రభావం ఆమె మీద చాలా కాలం వుంది. స్థానిక పురుషుల ఎత్తిపొడుపు, ఎగతాళి మాటలు, చూపులే అందుకు కారణం. తనే కాదు! తనలా బాధపడే ఆడపిల్లలు చాలామంది వున్నారని ఉష తెలుసుకుంది. వారందరితో సంప్రదించి ఎర్ర దండుగా ఏర్పడ్డారు. అయితే ఇందుకు సొంత కుటుంబాల నుంచి, స్థానికుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. అత్యాచారాలకు గురైన ఆడపిల్లలు నోర్మూసుకుని ఇంట్లో కూర్చోక ... ఇలా రోడ్లమీద పడడం సరికాదన్నారు. 'అయితే మూలన కూర్చోవాల్సింది బాధిత కాదు. అందులో ఆమె తప్పేమీ లేదు. మదమెక్కి అత్యాచారానికి ఒడికట్టినవాడే సిగ్గుపడాలి. శిక్ష అనుభవించాలి' అన్నది ఎర్ర దండు వాదన. ఎవరెంతగా వ్యతిరేకించినా... వీరు మాత్రం బాధితులకు అండదండలు అందించసాగారు. ఎవరైనా... ఎక్కడైనా మహిళలను వేధిస్తున్నారని తెలిస్తే చాలు! వెను వెంటనే అక్కడ వాలిపోతుంది ఎర్రదండు. మృగాళ్లకు పిడికిళ్లతో బుద్ధి చెప్తుంది. రెండోసారి ఆ అమ్మాయి వైపు చూడ్డానికి కూడా సాహసించరా మృగాళ్లు. అత్యాచార బాధితులకు విద్య, ఉపాధి అందించేందుకు కృషి చేస్తుంది. అన్నిటికంటే ముఖ్యమైన విషయం మరోటి వుంది. ఎర్రదండు అమ్మాయిలు ఆత్మరక్షణకు ఉపయోగపడే... మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందడమే కాక... స్థానిక పాఠశాలల్లో అమ్మాయిలకు కూడా నేర్పించసాగారు. క్రమేణా ఇప్పుడక్కడ అత్యాచారాలు, వేధింపుల సంఖ్య గతంకంటే తగ్గింది. ఈ దండును అత్యంత సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్న ఉషా విశ్వకర్మ ఇప్పుడక్కడ సెలబ్రెటీగా మారిపోయింది. విదేశాలు వెళ్లిమరీ ఆడపిల్లల ఆత్మరక్షణపై తన ఆలోచనలను పంచుకుంటోంది. స్థానిక పత్రికల్లోనే కాక ... విదేశీ పత్రికలు, చానళ్లలో ఎర్రదండుపై వార్తలు, ప్రత్యేక కథనాలు ఎన్నో వచ్చాయి. వస్తూనే వున్నాయి.

వేధిస్తే విరిచేస్తాం

వైభవి ఉల్మేల్, మహారాష్ట్ర

భక్తి, భయం. ఈ రెంటిల్లో ఏదో ఒకటి వుండాలి. అప్పుడే అరాచకాలకు తావుండదు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ గ్రామం ఇందుకు నిలువెత్తు నిదర్శనం. మన దేశంలోని అన్ని గ్రామాల్లాంటిదే చంద్రాపూర్ కూడా. అక్కడి అమ్మాయిలకూ వేధింపులు ఎదురయ్యాయి. ఎవరికి వారు ఆ ఘటనల తాలూకు గాయాలను గుండెల్లో దాచు కోవడం...వంటరిగా బాధపడడం మినహా మరేం చేయలేకపోయేవారు. పద్దెనిమిదేళ్ల వైభవి ఉల్మేల్ వారిలో ఒకటి. అయితే ఆ విషయం నిన్నటి దాకానే. కొన్ని సంవత్సరాల కిందట ... తమ కుటుంబానికి బాగా పరిచయమున్న యాభయ్యేళ్ల వ్యక్తి ఆమెను నీడలా వెంటాడి వేధించాడు. అమ్మానాన్నలకు అంత బాగా పరిచయమున్న వ్యక్తి అలా చేసేసరికి ఆశ్చర్యపోయింది. బాధితలందరి మాదిరిగానే వైభవి కూడా ముందు తననే నిందించుకుంది. తనదే తప్పనుకుంది. అయితే మెల్లగా తెల్సింది. తనలాంటి బాధితలు చుట్టూ అనేకమంది వున్నారని. వాళ్లు కూడా తమకెదురైన చేదు అనుభవాలను పంచుకున్నారు. అప్పుడు నిర్ణయించుకుంది వైభవి. ఎన్నటికీ బాధితగానే మిగిలిపోకూడదని. ఎదురు తిరగాలని. వారికి బుద్ధి చెప్పాలని. నేస్తాలకు కూడా విషయం అర్థమయ్యేలా వివరించింది. వారు కూడా అందుకు అంగీకరించడంతో ఒక బృందంగా ఏర్పడ్డారు. దీనికి యునిసెఫ్ 'దీప్‌శిఖ' సహాయసహకారాలు కూడా అందడంతో బాధితలకు అండగా నిలబడసాగారు.

'ఓసారి మా స్నేహితురాలిని ఒక వ్యక్తి ఏడిపించడం చూశాం. సహించలేకోపాయం. ఎర్రదండు మొత్తం కలిసి ... ముష్టిఘాతాలు, స్కూలు బ్యాగ్గులతో వాడికి బుద్ధిచెప్పాం. పెద్దల సాయంతో గ్రామం నుంచి కూడా పంపించివేశాం. అల్లరి చిల్లర వేషాలేసేవారెవరైనా సరే ఆ పని చేయాలంటే ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్నారు' అంటోంది వైభవి మెరుస్తున్న కళ్లతో. బాల్యవివాహాలు ఎక్కడైనా జరుగుతున్నాయని తెలిస్తే మాత్రం వీరు అక్కడికి చేరుకుంటారు. మేజర్లకు పెళ్లి చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించి బాల్య వివాహాన్ని ఆపుచేయిస్తారు.

వితంతువులకూ సమాన హక్కులు

జ్యోతి యాదవ్, జైపూర్, రాజస్థాన్.

పదమూడేళ్ల పల్లెటూరి పిల్ల యాభై మంది వితంతువుల జీవితాలను మార్చివేసిందంటే నమ్మబుద్ధి కాదు. అయితే అదంత సులభంగా వచ్చిపడలేదు. అందుకోసం ఆ అమ్మాయి ఎన్నో కష్టాలకోర్చింది. ఆటంకాలను అధిగమించాల్సి వచ్చింది. అన్నిటినీ ఆనందంగా ఎదుర్కొంది. తన ఎదురుగా కన్పిస్తున్న ఫలితాల ముందర అవేవీ లెక్కలోనివి కాదన్నట్టు వుంటుంది. ఆమే జ్యోతి యాదవ్. ఏడవ తరగతి చదువుతోంది. అదీ అల్వార్ జిల్లాలోని ధాని దబవాస్ అనే కుగ్రామంలో. తల్లికి జరుగుతున్న అన్యాయాన్ని చూసి తట్టుకోలేక ఆమె పోరాటం ప్రారంభించింది. జ్యోతి తండ్రి పద్నాలుగేళ్ల కిందట మరణించాడు. అప్పటి నుంచి తల్లి ఇంటికే పరిమితమవడం, గ్రామంలో జరిగే శుభకార్యాల్లో పాలు పంచుకోవడానికి అనుమతి లేకపోవడం, రంగు చీరలు కట్టుకోనివ్వకపోవడం, ఆమె మాటకే విలువ లేకపోవడం, ఆమెను రెండవ తరగతి పౌరురాలుగా పరిగణించడం...గమనించింది చిన్నారి జ్యోతి. 'ఊళ్లో జరిగే పెళ్లిళ్లకు రానివ్వకపోవడంతో... మా అమ్మ ఎన్నో సార్లు ఒంటరిగా కూర్చుని ఏడవడం నేను చూశాను. వితంతువులను అశుభసూచకంగా భావించడమే అందుకు కారణం. ఇలాంటి వారందరి ఆత్మగౌరవాన్ని తిరిగి అందివ్వాలన్నది నా కోరిక. అయితే అది ఉపాధితోనే సాధ్యమౌతుంది' అంటోంది జ్యోతి. అందుకోసం ముందుగా గ్రామస్థులతో మాట్లాడేందుకు ప్రయత్నించింది. అయితే అంతా చిన్న పిల్ల మాటలుగా భావించి తీసిపడేసేవారు. ఇలా లాభం లేదనుకొని తన టీచర్ల సాయం తీసుకోవాలనుకుంది. అందుకు వారు కూడా ముందు రావడంతో జ్యోతి లక్ష్య సాధనకు ఆయుధం దొరికినట్టయింది. వారి సలహాలు సూచనల మేరకు ముందుగా గ్రామంలో వున్న వితంతువుల ఇళ్లకు వెళ్లి మాట్లాడనారంభించింది. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కళ్లకు కట్టినట్టు చెప్పి మార్పు తీసుకురావాలని కోరింది. వారిని అందరితోపాటు కలిసి అన్ని కార్యక్రమాల్లో పాల్గొననివ్వాలంది. వారు కూడా గౌరవ ప్రదంగా పనిపాటలు చేసుకోనివ్వాలంది. అనుకున్నట్టుగానే ఇవాళ ఊళ్లో యాభై మందికి పైగా వితంతువులు... పని చేసుకుంటూ అందరిలో ఒకరిగా గౌరవప్రదమైన జీవితం గడుపుతున్నారు. వీరంతా ఆశ సహాయకులుగాను, అంగన్వాడీ వర్కర్లుగాను, రేగా కార్మికులుగాను వున్నారు. ఇవాళ జ్యోతి తల్లి అంగన్వాడి వర్కర్‌గా పనిచేస్తోంది. 'మా అమ్మాయి జ్యోతిని చూసి నేనెంతో గర్వపడుతున్నాను. తన వల్ల నాలాంటి చాలామందికి గౌరవం దక్కింది. పర్దా లేకుండానే ఇవాళ నేను ఎక్కడికైనా వెళ్లగలుగుతున్నాను. పెళ్లిళ్లకూ హాజరౌతున్నాను' అంటోంది జ్యోతి తల్లి. సంతోషంగా.

విద్యతోనే సాధికారత



మన్‌ప్రీత్ కౌర్, పంజాబ్.

పదిహేడేళ్ల మన్‌ప్రీత్‌కౌర్ విద్యా వ్యాప్తికై నడుం కట్టింది. అంత చిన్న పిల్ల అంత పెద్ద బాధ్యతను ఎందుకు నెత్తికెత్తుకుందీ? అంటే కారణం వుంది. పేదరికం కారణంగా తనను ఇంట్లో చదువు మాన్పించేశారు. అయితే అదే పేదరికంలో వుండి కూడా తమ్ముణ్ణి చదివించడం ఆమెను కూసింత ఆశ్చర్యపరచింది. నిజానికి మన్‌ప్రీత్ నాన్న బేల్దారి పని చేస్తాడు. తల్లికి నిత్యం అనారోగ్యం. వచ్చే కొద్ది పాటి పైసలతోనే తనకు రోజూ మందులు కొని వాడాల్సి వుంటుంది. అక్షరాలను ఆరాధించే ఆ అమ్మాయి ఎన్నో కష్టాలకోర్చి... ఇప్పుడు ప్లస్ టు చదువుతోంది. మరోవైపు స్కూల్లో పాఠాలు చెప్తోంది. 'నాలాంటి ఆడపిల్లలకు చదువు ద్వారా సాధికారత కల్పించాలన్నది నా కోరిక. మెట్రిక్యులేషన్ తర్వాత... నా నేస్తాలందరూ పై చదువుకు వెళ్తుంటే...నేను బలవంతాన ఇంట్లో వుండాల్సి వచ్చింది. అది నాకు చాలా బాధనిపించింది' అంటోంది మన్‌ప్రీత్. అయితే ఇంట్లో గడవదనీ, స్థోమత లేదని అలా వుండిపోలేదు. మనసుంటే మార్గం వుంటుందన్నట్టు...ఎక్కడైనా ఒక చిన్న దారి కనిపించకపోతుందా! తను చదువు కొనసాగించడానికి! అని ఆలోచించగా... ఒక దారి దొరికింది. అనాథ పిల్లలకోసం హోటల్లో పనిచేసే యువకుడు మిధున్ నడిపే స్కూలు ఆమె పాలిట పెన్నిధిలా తోచింది. వెంటనే అతనితో మాట్లాడి స్కూల్లో చేరిపోయింది టీచర్‌గా. నెలకు 500 రూపాయల జీతం. మొత్తానికి తన కల నెరవేరింది. ఇప్పుడు తను చదువుకోవడమే కాక...తనలాంటి పేద పిల్లలకు ఉచితంగా అక్షరదానం చేసే పనిలో వుంది.

బడికెళ్లాల్సిన వయసులో వివాహాలొద్దు

షైల్జా, నీలాంబర్, కేరళ.

పసి వయసులోనే బడిమానేసింది షైల్జా. బలవంతంగా. పదమూడేళ్లకే పెళ్లిపీటలమీద కూర్చుని సంసార బంధంలో చిక్కుకుంది. అయినప్పటికీ చదువుకుంటానని అమ్మానాన్నల్ని పోరింది. చెవిటివాని ముందు శంఖం వూదిన చందమే అయ్యింది. ఇవాళ పరిస్థితులు మారిపోయాయి. చట్టం చెప్పిన వివాహ వయసుకంటే ముందుగా పిల్లలకు పెళ్లిళ్లు చేయబోమని ప్రతిజ్ఞ చేసిన 2,519 మంది నీలాంబర్ వాసులలో షైల్జా ఒకటి. నీలాంబర్ మున్సిపాలిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'సమీక్ష' విద్యా కార్యక్రమం షైల్జా లాంటి ఎంతో మంది ఆపివేసిన చదువు కొనసాగించడానికి ఉపయోగపడింది. 'ఇవాళ మా అబ్బాయి తొమ్మిదివ తరగతిలో వున్నాడు. వాడికి చదువులో నేను సాయం చేస్తున్నాను. చదువుకోవడం వల్ల నేను సామాజిక దురాచారాలపై పోరాడగలుతున్నాను. మా బతుకులు బాగుచేసుకోవడానికి విజ్ఞానమే సరైన ఆయుధం' అంటోంది షైల్జా. నీలాంబర్ ముస్లింలు అత్యధికంగా నివసించే ప్రాంతం. అలాంటి చోట కట్నం, బాల్యవివాహాలు బాగా వుండేవి. ఇప్పుడా వాతావరణమే మారిపోయింది. కట్నం అన్న మాటే వినపడని చోటుగా ఇది పేరుపొందింది. ఇప్పుడు ఎవరూ అక్కడ కట్నం తీసుకోరు. బాల్య వివాహాలు చెయ్యరు. అందుకు షైల్జా లాంటి వారెందరో కృషి వుంది.

మహిళా విద్యకై మడమ తిప్పని పోరు

రంగీలా మేధి, అస్సాం.

ఝుకాపరా! అస్సాంలోని ఓ కుగ్రామం. గౌహతికి 70 కిలోమీటర్ల దూరంలో వుంటుంది. అలాంటి చోట ... అరవయ్యేళ్ల కిందట ... ఓ పేదింట పుట్టింది రంగీలా! చదువంటే ప్రాణం. శ్రద్ధగా బడికెళ్లేది. తనను ఓ రోజు బడి నుంచి బరబరా ఈడ్చుకొచ్చేశాడు తండ్రి. అందుకు పెద్ద కారణమేం లేదు. తమ్ముళ్లు, చెల్లాయిల ఆలనా పాలనా చూడ్డానికే. అలా ఆమె చదువు అటకెక్కేసింది. కాస్త ఎదిగిన దగ్గర నుంచి కూలి పనికి వెళ్లనారంభించింది. అవివాహితగానే నాలుగు పదులు నిండిపోయాయి. సరిగ్గా అప్పుడే... నేత మహిళల గ్రూపు నాయకురాలిగా అందుకున్న చెక్కు విషయంలో స్థానిక పురుషులల మోసానికి గురైంది. ఆ క్షణంలోనే నిర్ణయించుకుంది చదువుకోవాలని. చదువు లేని వారు ప్రాణం వున్న కట్టెతో సమానమని రంగీలా నమ్మకం. రాష్ట్ర ప్రభుత్వం నడిపే జ్ఞాన్ విజ్ఞాన్ సమితిలో చేరి చదువు నేర్చుకుంది. ఆ తర్వాత రెండు పుస్తకాలు కూడా రాసింది. ఇప్పుడామె వయోజన పాఠశాల మేనేజింగ్ కమిటీ సభ్యురాలు. గ్రామంలో మహిళలను, ఆడపిల్లలను చదువుకోమని ప్రోత్సహిస్తుంటుంది. బడిలో చేర్పిస్తుంటుంది. విసుగూ విరామం లేకుండా చుట్టుపక్కల పదిహేను గ్రామాల్లో ఎంతో మంది మహిళలను చదువుకునేలా చేసింది. వారానికి రెండు రోజుల పాటు మధ్యాహ్నం పూట గ్రామ మహిళలు రంగీలా ఇంటికొచ్చి చదువు నేర్చుకుంటారు.

'నేను బతకడం కోసం వరిచేలో పనిచేస్తాను. పనయినా మానుకుంటా కానీ... చదువుకోసం ప్రచారం చేసే అవకాశం వస్తే మాత్రం వదులుకోను' అంటోంది అక్షర ప్రేమికురాలు రంగీలా.

❄

ఎర్ర తివాచీ ఎందుకోసం!

◆ కవర్‌స్టోరీ



ఎంత మార్పు ! నిన్నటి వరకు నరేంద్రమోడీ అమెరికన్ల దృష్టిలో అంతర్జాతీయ వెలివేతకు గురైన వ్యక్తి !! నేడు, సరిలేరు నీకెవ్వరూ రావయ్యా రా రాజరాజ నరేంద్రా అంటూ వంగి వంగి సలాములు. కళ్లు దిమ్మతిరిగే రాచ మర్యాదల ఎర్రతివాచీ. సంవత్సరాల తరబడి అమెరికా సందర్శనకు వీసా ఇచ్చేందుకు నిరాకరించిన అమెరికా జన్మజన్మల బంధం అన్నంతగా ఇప్పుడు కావలించుకుంటున్నది. గతంలో వీసా నిరాకరించిన చర్యకు హర్షాతిరేకం ప్రకటించిన ప్రజాస్వామిక, పౌరహక్కుల వాదులు ఇప్పుడు ఔరా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. అమెరికా గడ్డపై అడుగు పెట్టనివ్వకపోవటాన్ని అవమానంగా భావించిన మోడీ అనుయాయులు తమ నేత అమెరికన్లను ఎన్నటికీ క్షమించడనీ పలికిన పలుకులన్నిటినీ దిగమింగి అమెరికాలో రాచమర్యాదలకోసం తహతహలాడుతున్నారు.

ఎం. కోటేశ్వరరావు

ప్రధాని నరేంద్రమోడీ ఐదు రోజుల పర్యటన శుక్రవారం నాడు ప్రారంభమైంది. మంగళవారం వరకు ఆయన అక్కడే ఉంటారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి సమావేశంలో ఉపన్యాసం తప్ప మిగతాదంతా అమెరికన్ల మర్యాదలు పొందటం, కార్పొరేట్ దిగ్గజాలను కలవటం తప్ప ఇతర ప్రధాన వ్యాపకాలేవీ లేవు. ముఖ్యంగా మన దేశానికి పరిశ్రమలు, టెక్నాలజీ తేవడానికి ఒప్పందాలు చేసుకోవడం వంటివి ఒక్కటైనా వున్నట్టు ఎక్కడా ఏ అధికారిక ప్రకటనలోనూ, వివరణలోనూ

మనకు కనపడదు.

2002 గోద్రా ఘటన అనంతరం వందలాది మంది ముస్లిం మైనారిటీలను ఊచకోత కోసిన దారుణాన్ని నివారించేందుకు గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోడీ ఎలాంటి చర్యలు తీసుకోనందుకుగాను తమ గడ్డపై అడుగు పెట్టటానికి వీలులేదని వీసా నిరాకరిస్తున్నట్లు తొమ్మిదేళ్ల క్రితం అమెరికా ప్రకటించింది. మత స్వాతంత్ర్యాన్ని తీవ్రంగా ఉల్లంఘించిన అధికారంలోని వ్యక్తులను నిషేధించే అమెరికా నిబంధనల ప్రకారం ఆ చర్య తీసుకున్నారు. వికీలీక్స్ వెల్లడించిన వివరాల ప్రకారం భారత్‌లోని అమెరికా రాయబారి తమ దేశానికి పంపిన రహస్య వర్తమానంలో మోడీ అంతర్జాతీయ అంటరాని వ్యక్తిగా పరిగణించబడుతున్నారనీ, మోడీకి వీసా నిరాకరించినందుకు గాను 'అమెరికాను ఎప్పటికీ క్షమించడని' బిజెపి నాయకులు తనతో వ్యాఖ్యానించినట్లు పేర్కొన్నారు. మోడీ అధికారంలోకి వస్తే మరింత అమెరికా వ్యతిరేకిగా ఉంటారని, సహకరించడని కూడా రాయబారి నివేదించాడు.

మరి అప్పటికీ ఇప్పటికీ వచ్చిన మార్పు ఏమిటి? తమకు బిజెపిలోని ఇతర నాయకులన్నా, గుజరాతీయులన్నా ఎలాంటి వ్యతిరేకత లేదనీ, కేవలం మోడీ పట్లనే అభ్యంతరమనీ అమెరికన్లు గతంలోనే స్పష్టం చేశారు. తమ అవగాహనను వారు మార్చుకున్నారా? మార్చుకున్నట్లు ఇంతవరకు అధికారికంగా ప్రకటించలేదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోడీ ప్రధానిగా ఉన్నత స్థానానికి ఎదిగారు. ఆయనపై వచ్చిన విమర్శలు అలాగే ఉన్నాయి. మారణ కాండ కేసులు ఇంతవరకు పరిష్కారం కాలేదు.

గత లోక్‌సభ ఎన్నికలలో బిజెపి ఘనవిజయం సాధించగానే మోడీ సర్కార్‌ను ప్రసన్నం చేసుకొనేందుకు నెల రోజుల వ్యవధిలోనే అమెరికా రక్షణ, విదేశాంగ మంత్రులు వెంటవెంటనే ఢిల్లీలో వాలి పోయారు. మోడీని అమెరికాకు ఆహ్వానించడమే కాకుండా వైట్‌హౌస్‌లో మోడీకి ఎర్ర తివాచీ పరచేందుకు ఎదురుచూస్తున్నారు.

మార్పుకు కారణం

మొదటిది అంతర్జాతీయ ఆర్థిక రంగంలో వస్తున్న మార్పులు. వాణిజ్య రంగంలో గత దశాబ్ది కాలంలో అమెరికాను వెనక్కు నెట్టి భారత వాణిజ్య భాగస్వామిగా రెండు రెట్లు పెరిగి చైనా ముందుకు వచ్చింది. గతేడాది అమెరికాతో వాణిజ్యం మూడుశాతం తగ్గింది. గతవారంలో చైనా అధ్యక్షుడు శీ జిన్ పింగ్ పర్యటన సందర్భంగా రానున్న ఐదు సంవత్సరాలలో ప్రభుత్వ పరంగా 2000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెడతామని వాగ్దానం చేశారు. అంతకు ముందు మోడీ జపాన్ పర్యటనలో భారత్‌కు రుణాలు, పెట్టుబడులు కలిపి 3300 కోట్ల మేరకు అబె సర్కార్ వాగ్దానం చేసింది. 'జపాన్, చైనా మాదిరి భారత్‌కు ప్రత్యక్ష లేదా పరోక్ష ఆర్థిక సాయం చేసే స్థితిలో నేడు అమెరికా ప్రభుత్వం లేదని' ఐఎంఎఫ్ మాజీ అర్థికవేత్త, న్యూయార్క్‌లోని కార్నెల్ విశ్వవిద్యాలయంలో ఆర్థశాస్త్ర బోధకుడు ఈశ్వర ప్రసాద్ వ్యాఖ్యానించారు. 'దీర్ఘకాలంలో తమ ఆర్థిక వ్యవస్థ ఇబ్బడి ముబ్బడిగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయని ఒప్పించటం ద్వారా ప్రయివేటు పెట్టుబడిదారుల నుంచి ఎక్కువ నిధులు రాబట్టుకోవాలని చూస్తోందని' కూడా ప్రసాద్ వ్యాఖ్యానించారు. అందుకు నిదర్శనమా అన్నట్లు మోడీ తన పర్యటనలో పెప్సి, గూగుల్, జనరల్ ఎలక్ట్రిక్, బోయింగ్, ఐబిఎం, గోల్డ్‌మాన్ శాచస్ వంటి పదకొండు బడా కంపెనీల ఉన్నతాధికారులతో భేటీ అవుతారు. భారత్‌తో తమ సంబంధాల్లో ప్రతిష్టంభనను తొలగించడం, అమెరికన్ కార్పొరేట్ ప్రయోజనాలకు పెద్ద పీటవేయడమే అమెరికా ఎర్రతివాచీ వెనుక ఉన్న అంతరార్థం అని పరిశీలకుల భావన.

వాజ్‌పేయి, క్లింటన్

ప్రపంచ ధనిక దేశాలు, కూటముల మధ్య ఉన్న పోటీ లేదా విబేధాలను ఉపయోగించుకొని లాభపడటం భారత బూర్జువావర్గ ఎత్తుగడలో ప్రధాన లక్షణం. పూర్వపు సోవియట్, తూర్పుఐరోపా దేశాల కూటమికీ, అమెరికా-పశ్చిమ దేశాల కూటమికీ మధ్య ఉన్న విబేధాలనుండి వారు బాగా లబ్ధి పొందారు. సోవియట్ అంతరించిన తరువాత గత పాతికేళ్లలో అమెరికావైపు మొగ్గి దాని జూనియర్ భాగస్వామిగా లబ్ధి పొందాలని చూస్తున్నారు. అయినప్పటికీ సంబంధాల్లో అనేక ఘర్షణలు తలెత్తుతూనే ఉన్నాయి.

గత పాతికేళ్లలో జపాన్ ఆర్థిక పక్షవాత రోగిగా మారటం, అమెరికా, ఐరోపా యూనియన్ గతంలో ఎన్నడూ ఎరగని సంక్షోభంలో కూరుకుపోవటం, ఇదే సమయంలో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ చైనా అప్రతిహతంగా ముందుకు పోవటం, జపాన్‌ను వెనక్కు నెట్టి రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిన క్రమంలో భారత్‌కు కొన్ని కొత్త అవకాశాలు వచ్చాయి. ఈ అవకాశాలను ఉపయోగించుకునే క్రమంలోనే భారత్ బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికా, చైనాలతో కలిసి 'బ్రిక్స్'లో చేరింది. ధనిక దేశాలకు అది ఇష్టం లేదు.

సంఘపరివార్ దాని అనుబంధ సంస్థలైన జనసంఘం, బిజెపి, ఇతర సంస్థలు చైనా వ్యతిరేకతను అణువణువునా జీర్ణించుకున్నాయి. అధికారంలో ఉన్నా వాటికి ఆ వ్యతిరేకత పోలేదు. అదే సమయంలో చైనాతో వాణిజ్య సంబంధాలు మెరుగుపరుచుకోవడం వెనుక భారత ప్రజల ప్రయోజనాలతోబాటు, పాలక వర్గాల ప్రయోజనాలు కూడా దాగున్నాయి. అందుకే అధికారంలో నాడు వాజ్‌పేయి ప్రభుత్వం ఉన్నా, నేడు మోడీ ప్రభుత్వం ఉన్నా చైనాతో సయోధ్య లక్ష్యంగానే పనిచేశారు. ఈ కారణంగానే ఇటీవలి కాలంలో ఉభయ దేశాల మధ్య వాణిజ్యం, ఇతర సంబంధాలు బలపడుతున్నాయి. అమెరికాకు ఇది కంటగింపుగా మారడం సహజమే. ఎందుకంటే అంతర్జాతీయంగా చైనా వ్యతిరేక కూటమిలో భారత్‌ను జూనియర్ భాగస్వామిని చేసుకోవాలన్న అమెరికా

వ్యూహాన్ని ఇది దెబ్బతీస్తుంది.

అమెరికా వ్యూహంలో భారత్

ఈనెల ప్రారంభంలో జపాన్ పర్యటనలో అక్కడి నాయకత్వాన్ని మెప్పించేందుకు 'విస్తరణ వాదానికి' వ్యతిరేకంగా జపాన్-భారత్ చేతులు కలపాలని మోడీ వ్యాఖ్యానించారు. ఆయన ఉద్దేశ్యంలో విస్తరణం వాదం చైనాది. చైనాకు వ్యతిరేకంగా ఈ వాదాన్ని ముందుకు తెచ్చి ప్రచారం చేస్తున్నది అమెరికా. ఆర్థిక, సాంకేతిక, సైనిక రంగాల్లో అప్రతిహతంగా ముందుకు దూసుకుపోతున్న సోషలిస్టు చైనాను నిలువ రించేందుకు అమెరికా ఇటీవలి కాలంలో 'చైనాను చుట్టుముట్టే' వ్యూహాన్ని అమలు జరుపుతోంది. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, ఫిలిప్పయిన్స్‌లు ఈ వ్యూహంలో భాగస్వాములుగా ఉన్నాయి. భారత దేశాన్ని కూడా ఈ వ్యూహంలో ఇముడ్చుకుని, హిందూ మహా సముద్రంలో దాన్ని జూనియర్ భాగాస్వామిగా ఉపయోగించుకోవాలన్నది అమెరికా వ్యూహం. ఈ వ్యూహంలోకి భారత్‌ను లాగడం కోసమే 2005లో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌తో అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ 'అమెరికా-భారత్ రక్షణ చట్రం' పేరుతో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. దీనికి అనుగుణంగానే గత దశాబ్ద కాలంగా భారత విదేశీ విధానంలో అమెరికా అనుకూలత కనిపిస్తున్నది.

గతంలో సోవియట్ యూనియన్‌కాలంలో మాదిరిగానే నేడు చైనాను సైనికంగా చుట్టుముట్టి చక్రబంధంలో ఇరికించాలని అమెరికా వ్యూహం పన్నుతున్న నేపథ్యంలో భారత దేశం ఒకవైపు అమెరికా వ్యూహానికి చేరువగా ఉంటూ మరోవైపు ఆర్థిక, వాణిజ్య రంగాల్లో చైనాతో చెలిమికి చేయి చాస్తోంది. ఈ వైరుధ్యం మనకు అమెరికా-భారత్, చైనా-భారత్ సంబంధాల్లో నిత్యం కనిపిస్తుంది.

చైనా అధ్యక్షుడు ఇటీవల మన దేశంలో పర్యటించినపుడు చైనా సైనికుల చొరబాటు గురించి అమెరికా సంస్థలు వ్యాపింప చేసిన కట్టుకథలను మోడీ సర్కార్ పట్టించుకోలేదు. అదే సమయంలో ఆయన న్యూయార్క్ పర్యటనకు ముందు అమెరికన్లు తమకు సహజ మిత్రులని వర్ణించారు. తన పర్యటన సందర్భంగా మోడీ అమెరికా టీవీ ఛానల్ సిఎన్ఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వాషింగ్టన్-ఢిల్లీలోని రాజకీయ నాయకుల మధ్య ఉన్న సంబంధాల కంటే ఎక్కువగా ఉభయ దేశాల సంబంధాలుంటాయని చెప్పారు. స్వభావ రీత్యా అమెరికాతో అంటకాగేందుకు సిద్ధమే అయినా ఎక్కడన్నా బావే కాని వంగతోట దగ్గర కాదన్నట్లుగా మార్కెట్లు, లాభాల విషయంలో స్వంత ప్రయోజనాలకే పెద్ద పీట. మీరు పెట్టుబడులు పెట్టకపోతే మాకు చైనాతో సహా బలమైన బ్రిక్స్ దేశాలున్నాయన్న పరోక్ష హెచ్చరిక కూడా దాగి ఉంది. ఫసిఫిక్ దేశాల ఒప్పందంలో భారత్ అమెరికాతో కలిసి రావటం లేదని, ఆసియన్ +6 దేశాలతో ప్రాంతీయ ఒప్పందాలను చేసుకొనేందుకు భారత్ పూనుకుందని దానిలో అమెరికా లేదని కూడా ఒక అమెరికన్ లాబీయిస్టు వాపోయాడు.

భారత్ - అమెరికా సంబంధాల్లో హానికర అంశాలు

అమెరికా నిజానికి మనకు ఏనాడూ సహజ మిత్రదేశం కాదు. మన స్వాతంత్ర్య ఉద్యమాన్ని సోవియట్ యూనియన్ బలపరచగా అమెరికా బ్రిటీష్ వారికే మద్దతిచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ పెత్తనం అంతరించటం, మనకు స్వాతంత్ర్యం రావటం ఒకేసారి జరిగాయి. అప్పటి నుంచి మనలను గుప్పిటలో ఉంచుకొనేందుకు ప్రయత్నించి సాధ్యం కాకపోవటంతో మన ప్రయోజనాలను దెబ్బతీసేందుకు అమెరికన్లు చేయని యత్నం లేదు. దేశ విభజన జరగ్గానే కాశ్మీర్‌ను అక్రమించిన పాకిస్థాన్‌కు వంత పలికారు. బెదిరింపులతో లొంగదీసుకోవాలని చూశారు. కాశ్మీర్ సమస్య తలెత్తటానికి కారకులు బ్రిటీష్ సామ్రాజ్యవాదులు. మన వైఖరిని బలపరచకుండా కాశ్మీర్ సమస్య పరిష్కారం పేరుతో పాకిస్థాన్‌కు వంత పాడింది అమెరికా. ఇప్పటికీ అది పరిష్కారం కాలేదంటే కాశ్మీర్‌ను మన అంతర్భాగంగా గుర్తించటానికి ఇప్పటికీ నిరాకరిస్తున్న అమెరికన్ల వైఖరే కారణం. అమెరికా అధ్యక్షుడు నిక్సన్ హయాంలో 1971లో మరోసారి మనపైకి పాకిస్థాన్‌ను పురికొల్పి యుద్ధానికి తలపడ్డారు. బంగాళాఖాతంలోకి తమ విమానవాహక యుద్ధనౌకను దింపి మనలను బెదిరించారు. 1974లో మన దేశం జరిపిన అణు పరీక్షలతో మనపై కక్షగట్టి అనేక ఆంక్షలు విధించారు. పాక్ అణుపరీక్షలు జరిపేందుకు అవసరమైన సాయం చేశారు.

మీ ఇంటికొస్తే మాకేం పెడతావ్, మా యింటికొస్తే మాకేం తెస్తావ్ అన్నట్లుగా అమెరికా వ్యవహరిస్తున్నట్లు మనకు ప్రతి సందర్భంలోనూ స్పష్టమౌతుంది. సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడులు రాకుండా అడ్డుకుంది. 1974లో మన దేశం తొలిసారి అణుపరీక్ష జరిపినపుడు అణు ఇంధనం, సాంకేతిక పరిజ్ఞానం కొనుగోలుపై నిషేధం విధించింది. ఫలితంగా మన అణు సంస్థలు ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. తీరా మనం అణు రంగంలో స్వయంశక్తిని సంపాదించిన తరువాత మెల్లగా దిగివచ్చింది.

సోవియట్ కూలిపోయిన తరువాత మన పాలకవర్గం అమెరికా ముందు సాగిల పడింది. మన దేశం అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం చేయనప్పటికీ మన మార్కెట్‌లో ప్రవేశించేందుకు అంతకు ముందు విధించిన ఏకపక్ష ఆంక్షలను తొలగించింది. పౌర అణు ఒప్పందం పేరుతో

వాజ్‌పేయి, జార్జి బుష్

అమెరికాలో పాతబడి, వారికి పనికిరాని అణువిద్యుత్ పరికరాలు, పరిజ్ఞానాన్ని మనకు అంటకట్టేందుకు మన మీద ఒప్పందాలను రుద్దింది. అవెంత దుర్మార్గంగా ఉన్నాయంటే మనం కొనుగోలు చేసిన ఆ పరికరాలు, పరిజ్ఞానం లోపభూయిష్టంగా ఉన్న కారణంగా ఏవైనా అణు ప్రమాదాలు సంభవిస్తే ఆ కంపెనీలే నష్టపరిహారం చెల్లించాలన్న నిబంధన ఎత్తివేయాలని మన ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నారు.

మన మిలిటరీ అవసరాలకోసం ఎక్కువగా అమెరికాపై ఆధారపడటం ఇటీవల ముందుకొస్తున్న ప్రమాదం. అమెరికాలో మిలిటరీ పరికరాలన్నీ బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ప్రయివేటు కార్పొరేట్ సంస్థల చేతుల్లోనే ఉన్నాయి. మన అవసరాల కంటే వాటి ఉత్పత్తులు అమ్ముకోవటానికి ప్రాధాన్యత ఇస్తాయి. ఒకసారి వాటి దగ్గర కొనుగోలు చేసిన తరువాత విడి భాగాలను అవి చెప్పిన ధరలు, షరతులతో కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

చైనాతో వాణిజ్యలోటులో ఉన్న అమెరికా మన వంటి దేశాలపై తన వస్తువులను రుద్ది ఆలోటును పూడ్చుకోవాలని చూస్తోంది. మోడీ పర్యటన సందర్భంగా అమెరికన్ లాబీయిస్టుల రాతలు, ప్రతిపాదనలు ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. జాషువా మెట్జర్ అనే ఒక రచయిత చైనాతో సమంగా జనాభా కలిగిన భారత్‌కు అమెరికా నుంచి వస్తు ఎగుమతులకు ఇంకా అవకాశాలున్నాయని పేర్కొన్నాడు. చైనాతో 2013లో 560 శతకోటి (బిలియన్) డాలర్ల మేర అమెరికా వస్తువులు ఎగుమతి చేస్తే దానిలో భారత్‌కు తొమ్మిదో వంతే ఉందన్నాడు. అంటే విదేశీ వస్తువులను ఇంకా నింపాలని చూస్తున్నారు. అదే జరిగితే మిగిలి ఉన్న మన పరిశ్రమలుకూడా మూత పడటం ఖాయం. మన దేశాన్ని అమెరికన్ వస్తు మార్కెట్‌గా మార్చే క్రమం ఊపందుకుంటోంది. 2003 నుంచి ఉభయ దేశాల మధ్య వాణిజ్య లోటు అమెరికాకే అనుకూలంగా ఉంది. అప్పుడు అది 630 కోట్ల డాలర్లయితే 2013లో 2540 కోట్లకు చేరింది. అంటే అమెరికా నుంచి మన దిగుమతులు పెరుగుతుంటే ఎగుమతులు తగ్గుతున్నాయి. గతంలో మన్మోహన్ సింగ్ పర్యటన తరువాత ఈ అంతరం పెరిగింది, మరి మోడీ పర్యటనతో ఈ పరిస్థితి మారుతుందా?

మన దేశం నుంచి వస్తు ఎగుమతులు ఎంత ఎక్కువగా పెరిగితే అది రైతులు, కార్మికులకు అంత ఉపయోగం. కానీ మనం సేవలను ఎక్కువగా ఎగుమతి చేస్తున్నాం. దీని వలన ఐటి రంగ ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుందన్నది నిజమే. ఈ కారణంగానే మన దేశంలో కొంత మేరకు ఉపాధి పెంచింది. ఇదే సమయంలో మన సేవలను కారుచౌకగా పొందుతూ అమెరికాలోని పెట్టుబడిదారులు అధిక లాభం ఆర్జిస్తున్నారు.

ఒబామా, మన్మోహన్

ఇప్పుడు అమెరికా ప్రయివేటు పెట్టుబడిదారులు క్లీన్ ఎనర్జీ పేరుతో వినియోగదారులపై పెను భారాన్ని మోపే పాతబడిన తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని మనకు అంట గట్టేందుకూ, లాభాలు వచ్చే ఆ ప్రాజెక్టులలో పెట్టుబడులు పెట్టేందుకూ అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. మన రక్షణ రంగంలో పెట్టుబడులకు అవకాశాలివ్వాలని చేస్తున్న డిమాండ్‌కు మోడీ సర్కార్ పచ్చజెండా ఊపింది. గతంలో ఉన్న 26శాతం పరిమితిని 49 శాతానికి పెంచింది. అంటే అమెరికన్ ప్రయివేటు పెట్టుబడిదారులు మనకు ఆయుధాలు తయారు చేసి పెట్టి లాభాలు వారు తరలించుకుపోతారు. నిర్మాణ రంగంలో విదేశీ పెట్టుబడులపై ఉన్న ఆంక్షలను కూడా మోడీ సడలించారు. ఆహార సబ్సిడీలను రద్దు చేయాలని అమెరికన్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే భారత ప్రభుత్వం దానివల్ల వచ్చే పర్యవసానాల గురించి భయపడుతోంది. మన దేశంలోని ఫార్మా కంపెనీలు తమ పేటెంట్ హక్కులకు భంగం కలిగిస్తున్నాయనీ, వాటిని కాపాడాలనీ పశ్చిమ దేశాల కంపెనీలు డిమాండ్ చేస్తున్నాయి. వాటిని కొంతమేర సంతృప్తి పరచేందుకే వంద ఔషధాలపై ప్రభుత్వ ధరల నియంత్రణ ఎత్తివేసి మోడీ న్యూయార్క్ వెళ్లారు. గత ఒప్పందాలన్నింటినీ అమలు జరుపుతామని మోడీ సర్కార్ అమెరికాకు హామీ ఇస్తోంది. దానిలో అణు ప్రమాద జవాబుదారీ చట్టం ఒకటి. దీనిని ఎత్తివేయాలని అమెరికన్లు ఎప్పటి నుంచో వత్తిడి తెస్తున్నారు. చిల్లర వర్తకంలో విదేశీ పెట్టుబడుల అనుమతి గురించి బిజెపి సర్కార్ దాగుడు మూతలాడుతోంది.

ఈ పూర్వరంగంలో ప్రధాని నరేంద్రమోడీ అమెరికా పర్యటన జరుపుతున్నారు. గతంలో మన ప్రధానులు పర్యటించిన ప్రతిసారీ అమెరికన్ కార్పొరేట్లకు విలువైన కానుకలు తీసుకు వెళ్లిన వారే. తొలి ఎన్‌డిఏ హయాంలో వాజ్‌పేయి అమెరికా పర్యటన సందర్భంగా టెలికాం, విద్యుత్ రంగాలను తెరిచే కానుకలతో వెళ్లారు. తరువాత మన్మోహన్ సింగ్ వామపక్షాల అభ్యంతరాలను తోసిరాజని వ్యూహాత్మక ఒప్పందాలకు పార్లమెంట్ ఆమోద ముద్ర కానుక తీసుకు వెళ్లారు. ఇప్పుడు మోడీ సర్కార్ వంద రకాల ఔషధాల ధరలపై మన ప్రభుత్వ నియంత్రణను ఎత్తివేసి అమెరికా సంస్థలకు సంతోషం కలిగించింది. రానున్న రోజుల్లో ఇంకా ఏ సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చి వస్తారో తెలియదు. గతంలో అమెరికాకు ప్రయోజనం కలిగించే ఒప్పందాలు చేసుకున్న ఏ పాలకుడూ, ఏ దేశంలోనూ ప్రజల మద్దతు పొందలేదు. మొన్నటి ఎన్నికలలో మన్మోహన్ సింగ్‌ను, యుపిఏ సర్కార్‌ను అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలు గట్టెక్కించలేకపోయాయి. అదే సత్కారం నరేంద్రమోడీకి జరుగుతుందా?

★

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

◆ సీరియల్

భాగం -3

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారధి

తనలో ఏదో మార్పు వస్తోంది. ఈ పరిస్థితి గురించి మొదటి సంవత్సరంలోనే తండ్రికో లేఖ రాశాడు కార్ల్ :

'డియర్ ఫాదర్,

మిమ్మల్ని వదలి వచ్చినప్పుడు నా ముందు ఓ కొత్త లోకం ఆవిష్కృతమైంది. అది ప్రేమ లోకం. ఇంకా నేను చేరుకోలేని ఓ ప్రేమ లోకం. బెర్లిన్‌కు రావటం ఒక అద్భుతమైన అనుభవంగా మిగలాలి. కానీ అది కూడా నాకు ఆనందం ఇవ్వలేదు. శిలగా మారిన నా మనసుకన్నా కరకు శిలలేమీ నాకు దారిలో కనిపించలేదు. భోజనం రుచించటం లేదు. జెన్నీ కన్నా అందమైనదీ, ముఖ్యమైనదీ మరేదీ లేదీ లోకంలో. ఇదీ నా ప్రస్తుత పరిస్థితి'.

అప్పటి మార్క్స్ ఆలోచనలు ఎంత అల్లకల్లోలంగా ఉన్నాయో స్పష్టమౌతూనే ఉంది. కవిత్వం రాయాలనుకుని జెన్నీ కోసం మూడు సంపుటాలు రాశాడు. 'అయినా, నా ప్రేమను వ్యక్తం చెయ్యటానికి ఏ మాత్రం సరిపోదు' అని రాశాడు. ఆ తర్వాత, 'లా' పుస్తకాలు 'క్లాసిక్స్' ముగించాడు. 'శిక్షాస్మృతి' 'మతపరమైన న్యాయశాస్త్రం' అధ్యయనం చేశాడు. 'ప్రాచీన రోమన్ సివిల్ లా' అనువాదం చేశాడు. మూడువందల పేజీలు 'ఫిలాసఫీ ఆఫ్ లా' రచించాడు. గ్రీకు నుండి అరిస్టాటిల్ రాసిన 'రెటారిక్' చరిత్రకారుడు టాసిటస్ రాసిన 'జెర్మానియా', కవి ఓవిడ్ రాసిన 'సాంగ్స్ ఆఫ్ శాడ్‌నెస్'లను లాటిన్ నుండి అనువదించాడు. ఇంగ్లీషు, ఇటాలియన్ నేర్చుకున్నాక 'ఒక వ్యంగ్య నవల 'స్కార్పియన్ అండ్ ఫెలిక్స్' రాశాడు. గోతే 'ఫాస్ట్' ప్రేరణతో 'ఊలానెమ్' అనబడే నాటకం ముగించాడు. ఆ తర్వాత 'పెద్దగా సాధించిందేమీ లేదు' అని రాసుకున్నాడు. అయితే, ఇంతటి తీవ్రమైన కృషి ఫలితంగా...

" ఒకవైపున ఉద్యోగం త్వరగా సంపాదించుకొమ్మని చెబుతూనే, జెన్నీ మనసు గాయపరచవద్దంటూ కొడుకును హెచ్చరించాడు. హైన్రీష్‌కు కొడుకంటే ప్రేమ ఉన్నమాట నిజమేకాని, జెన్నీలాంటి సంస్కారవంతురాలు, సౌందర్యవతి, గమ్యం లేకుండా తిరుగుతున్న యువకుణ్ణి ఇష్టపడుతున్నది. 'కనీసం ఆమె కోసమైనా క్రమశిక్షణతో బతుకు' అంటూ పలుసార్లు హెచ్చరించాడు' ఆమె సంతోషానికే జీవితం వెచ్చించాలి'అన్నాడు."

అతని మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతింది. నగరం వదిలి పల్లెపట్టులలో ప్రశాంతంగా తిరిగి రమ్మన్నాడు డాక్టర్. సలహా నచ్చింది. రివర్ స్ప్రీ తీరాన వున్న స్ట్రాలౌ గ్రామానికి వెళ్లి ఫిషింగ్‌లో కొంతకాలం గడిపాడు. అక్కడే ఉండటానికి వసతి కూడా దొరికింది. ఇంటి యజమానితో కలసి వేటకెళ్లాడు. అక్కడున్నప్పుడే తండ్రి రాసిన లేఖలో 'నేను అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడే హెగెల్‌ను మొదటి నుండి చివరిదాకా చదివాను. అతడి శిష్యుల గురించి కూడా తెలుసుకున్నాను' అని పేర్కొన్నాడు.

అప్పటికి హెగెల్ మరణించి ఆరేళ్లయింది. అక్కడి ప్రొఫెసర్లలో, విద్యార్థుల్లో ఆయన ప్రభావం కొంత తగ్గింది. కార్ల్ మార్క్స్ మేథో ప్రస్థానంలో హెగెల్‌ను దాటి ముందుకు పోక తప్పదు.

'మానవ జాతి చరిత్రంతా సంఘర్షణల, పోరాటాల మయమే' అన్నది హెగెల్ తాత్వికతకు ప్రాతిపదిక. రెండు ఆలోచనలు సంఘర్షించినప్పుడు మూడో ఆలోచన పుడుతుంది. అది మరో ఆలోచనతో సంఘర్షిస్తుంది. అంటే నిరంతర మార్పు జీవన స్వభావం ఇది. ఇది అనివార్యమని

గ్రహించిన హెగెల్ దీన్నే 'గతితార్కికత' అన్నాడు. ఈ గతితార్కికత క్రమం, బిగువు (tension) మీద ఆధారపడి ఉంటుంది. ఇవి అవసరం కూడా. ఎందుకంటే చరిత్ర ప్రగతికి సంఘర్షణ అనివార్యం. హెగెల్ గతితార్కికత, సంఘర్షణకు ఓ కొత్త అర్థమిచ్చింది. ఎంగెల్స్ మాటల్లో 'చరిత్రంతా అర్థంలేని హింసాత్మక సంఘటనల క్రమంలా కాక ఒక అర్థవంతమైన పరిణామ దశలుగా కనిపిస్తుంది. 'హెగెల్, ఆత్మ (spirit) అనే మరో అంశాన్ని కూడా ప్రవేశపెట్టాడు. చారిత్రిక పరిస్థితులలో ఇది ఒక సమూహానికి చెందిన ప్రజలందర్లో ఉంటుంది. వ్యక్తి తనను తాను చరిత్రలో భాగం కానని, తన కృషికందులో భాగం లేదనుకున్నప్పుడు దీని ప్రత్యామ్నాయం. 'పరాయీకరణ' అతణ్ణి ఆవహిస్తుంది.

ఆరోజుల్లో హెగెల్ తాత్విక భావనలు జర్మనీలోని మేధావులందర్నీ ప్రభావితం చేశాయి. డజన్లకొద్దీ హెగెలియన్లు నిరంతరం చర్చించి కొత్త విషయాలు ఆవిష్కరించటానికి ప్రయత్నించారు. మరి, హెగెల్ స్వయంగా బోధించిన బెర్లిన్ యూనివర్సిటీలో వాతావరణం మరెంత ఉద్రిక్తంగా ఉండేదో ఊహించుకోవాల్సిందే. అక్కడి యువ మేధావులు, ప్రొఫెసర్లు సంస్కరణలు కావాలన్నప్పుడల్లా వాళ్ల నోరు నొక్కేశారు. స్వేచ్ఛ తగ్గింది. ప్రభుత్వం యథాతథ స్థితి వైపే మొగ్గు చూపింది. వాళ్ల సరిహద్దుల కావల 'బెల్జియం, ఫ్రాన్సు, ఇంగ్లాండులలో రాజకీయ, ఆర్థిక, రంగాలలో పెను మార్పులు వస్తున్నాయి. అక్కడ ప్రభువులు ప్రజలకు స్వేచ్ఛనివ్వటమే అందుకు కారణమని వాళ్లకు తెలుసు. ఉక్కును రైలు పట్టాలుగా మార్చారక్కడ. వాటిమీద గంటకు అరవై మైళ్ల వేగంతో రైళ్లు పరిగెడుతున్నాయి. విద్యుచ్ఛక్తి తళుక్కుమంటోంది. టెలిగ్రాఫ్ ద్వారా సమాచార వ్యవస్థలో విప్లవం వచ్చింది. హెగెల్ బోధనల ప్రకారం ఇదంతా ఘర్షణ ఫలితమే. సంఘర్షిస్తే పెనుమార్పు – సామాజిక విప్లవం కూడా వస్తుంది.

యూరోపియన్ మేధావులందర్నీ ఆకర్షించిన అయస్కాంతం బెర్లిన్. కేవలం జర్మనులే కాదు, భూస్వామ్య వ్యవస్థ కింద మగ్గిపోతున్న రష్యన్లు కూడా అక్కడికే చేరుకుంటున్నారు. 'విశ్రాంతి' ముగించుకుని బెర్లిన్ తిరిగి వచ్చిన కార్ల్ బొహీమియన్ డాక్టర్స్ క్లబ్‌లోని యంగ్ హెగెలియన్ల బృందంలో చేరాడు. అక్కడ అతడికిష్టమైన రెండు పనులు నిరాటంకంగా కొనసాగించవచ్చు. ఒకటి తాత్విక చర్చలు. రెండవది తాగుడు.


మార్క్స్ పుట్టిన ఇల్లు

"మిమ్మల్ని వదలి వచ్చినప్పడు నా ముందు ఓ కొత్త లోకం ఆవిష్కృతమైంది. అది ప్రేమ లోకం. ఇంకా నేను చేరుకోలేని ఓ ప్రేమ లోకం. బెర్లిన్‌కు రావటం ఒక అద్భుతమైన అనుభవంగా మిగలాలి. కానీ అది కూడా నాకు ఆనందం ఇవ్వలేదు. శిలగా మారిన నా మనసుకన్నా కరకు శిలలేమీ నాకు దారిలో కనిపించలేదు. భోజనం రుచించటం లేదు. జెన్నీ కన్నా అందమైనదీ, ముఖ్యమైనదీ మరేదీ లేదీ లోకంలో. ఇదీ నా ప్రస్తుత పరిస్థితి."

బెర్లిన్‌లోని తొలి నెలల్లో మార్క్స్ ఎంత నైరాశ్యం అనుభవించాడో, అంతకన్నా ఎక్కువ అనుభవించింది జెన్నీ. తల్లిదండ్రుల మనసు గాయపర్చవద్దని, ఇద్దరూ ఉత్తరప్రత్యుత్తరాలు మానుకున్నారు. కానీ సమాచారం తెలియకపోవటంలో, ఆమెలో అసూయ పెరిగింది. కార్ల్ తనను అశ్రద్ధ చేస్తున్నాడు. బెర్లిన్ మహానగరంలో తను అతడికి ఇంకా గుర్తుంటుందా! ఇలా బెంగపెట్టుకుని జబ్బు పడింది. ఇది కేవలం శారీరకమనుకున్నారు ఆమె తల్లిదండ్రులు. కానీ జెన్నీది 'డిప్రెషన్' అని హైన్రిష్ మార్క్స్‌కు తెలుసు. జెన్నీ తల్లిదండ్రులకు తెలియకుండా ఇద్దరూ రాసుకున్న లేఖల్ని ఒకరివొకరికి చేర్చిన తనకు జెన్నీ పడిన బాధ తెలుసు. ప్రతిసారీ కొడుక్కు 'ఆమె నీ కోసం చేసిన త్యాగం అమూల్యం. సంఘంలో ఆమె గౌరవం నిలబెట్టే బాధ్యత నీదే. ఈ బాధ్యత విస్మరిస్తే నువ్వు క్షమార్హుడివి కాదు...' అని రాశాడు.

మూడు సంపుటాల కవితలతో జవాబిచ్చాడు కార్ల్. 1836 క్రిస్మస్‌నాటికి ఆమెకు కానుకగా ఇచ్చాడు. మొదటి రెండు ఆసక్తులకూ బుక్ ఆఫ్ లవ్' అనీ, మూడో దానికి 'బుక్ ఆఫ్ సాంగ్స్' అనీ పేరుపెట్టాడు. ఈ మూడు పుస్తకాలూ 'నా శాశ్వత ప్రేయసి జెన్నీ వాన్‌వెస్ట్‌ఫాలెన్'కు అంకితం'. ఈ పుస్తకాలను పదిలంగా దాచుకున్న జెన్నీ, కార్ల్ ప్రేమోద్ధృతాన్ని చూసి తనలోతానే నవ్వుకుంది. కానీ ఆ డిసెంబరులో వాటిని చేతిలోకి తీసుకుని స్పృశించినప్పుడు కన్నీరుబికి వచ్చింది. 'జెన్నీ నెమ్మదిగా తన తల్లిదండ్రులకు నచ్చజెబుతుందిలే' అని తన సోదరుడికి హామీ ఇచ్చింది సోఫీ.

అయితే, జెన్నీకి అదంత సులభమేమీ కాదు. ఈ కాలంలో ఆమె రాసిన లేఖలేవీ లభ్యం కావటం లేదు గాని, హైన్రిష్ మార్క్స్, కార్ల్‌కు రాసిన ఉత్తరాల ద్వారా కొంత సమాచారం తెలుస్తుంది. ఒకవైపున ఉద్యోగం త్వరగా సంపాదించుకొమ్మని చెబుతూనే, జెన్నీ మనసు గాయపరచవద్దంటూ కొడుకును హెచ్చరించాడు. హైన్రిష్‌కు కొడుకంటే ప్రేమ ఉన్నమాట నిజమేకాని, జెన్నీలాంటి సంస్కారవంతురాలు, సౌందర్యవతి, గమ్యం లేకుండా తిరుగుతున్న యువకుణ్ణి ఇష్టపడుతున్నది. 'కనీసం ఆమె కోసమైనా క్రమశిక్షణతో బతుకు' అంటూ పలుసార్లు హెచ్చరించాడు' ఆమె సంతోషానికే జీవితం వెచ్చించాలి' అన్నాడు.

కార్ల్, జెన్నీని ప్రాణం కన్నా ఎక్కువ ప్రేమించిన మాట నిజమే గాని, యూనివర్సిటీలో, యంగ్ హెగెలియన్లతో అతడి జీవితం పెనవేసుకుపోయింది. ప్రియురాలి ప్రేమ కోసం దహించుకుపోతున్నాడు. కానీ మేధో జీవితం, చర్చోపచర్చలు అతడికి ఊపిరిసలపనివ్వటం లేదు. మార్క్స్ జీవితమంతా రెండు పార్శ్వాలు అతణ్ణి శాసించాయి. ఒకటి ప్రేమ లోకం. మరొకటి మేధో మధనం.

మార్క్స్ మొదట అడాల్ఫ్ రూటెన్‌బర్గ్ అనబడే జాగ్రఫీ ప్రొఫెసర్ వద్ద శిష్యరికం చేశాడు. ఈ రూటెన్‌బర్గ్ అప్పటికే ఒక వార్తాపత్రికలో కొన్ని వివాదాస్పద వ్యాసాలు రాశాడు. ఆ తర్వాత ఒక రాడికల్ మత శాస్త్రాచార్యుడు బ్రూనోబార్ ప్రభావంతో కొన్నాళ్లున్నాడు. 'భగవంతుడు ఒక హేతుబద్ధమైన శక్తి. అతడే గతితార్కిక చారిత్రక చోదకుడు' అనబడే హెగెల్ అభిప్రాయంతో, వాంగ్ హెగెలియన్లు విభేదించారు. మనిషి తన చరిత్రను తనే నిర్మించుకుంటాడు. ఏ అదృశ్య శక్తీ అతడికి దారి చూపించటం లేదన్నది వీళ్ల వాదన. అయితే, ఈ వాదన పరిణామాలు ప్రమాదకరంగా ఉండే అవకాశం లేకపోలేదు.

దేవుడు చరిత్రగతిని శాసించటం లేదని అంగీకరిస్తే, ప్రభువులు దైవాంశ

సంభూతులు కారన్నమాట. మరి, రాజు మానవ మాత్రుడే అయితే, ఇతర్లు అతడి అధికారాన్ని ప్రశ్నించటానికి, ఎదిరించటానికీ అర్హులే.

రాజకీయపరంగా డైనమైట్ లాంటి వాదన ఇది. పంధొమ్మిదేళ్ల మార్క్స్ వీటిని ఆసక్తిగా గమనించాడు. ఈ చర్చా బృందాలలో, తనకన్నా పదేళ్లు పెద్దవాళ్లైన సీనియర్ ప్రొఫెసర్లు కూడా అతణ్ణి సమవుజ్జీగా అంగీకరించారు. ('రూసో, వోల్టేర్, హైన్, హెగెల్ కలిస్తే ఒక మార్క్స్ అవుతాడు' అన్నాడో సీనియర్ ప్రొఫెసర్) ఈ చర్చల్లో. మార్క్స్, ఒక రాజీపడని ఖచ్చితమైన వాదనా ధోరణిని అలవర్చుకున్నాడు. పరిణామ ఫలితంగా అనేకమంది శత్రువులు కూడా తయారయ్యారు. కొన్ని దశాబ్దాల తర్వాత 'మార్క్సిజం'గా పిలువబడిన భావజాలానికి ఆ వాదనలే బీజాలు. ఈ సమయంలో మార్క్స్‌కు అగ్నికీలల మీద నడుస్తున్నట్టుగా ఉండి ఉంటుంది. లుడ్విగ్ వాన్ వెస్ట్‌ఫాలెన్‌తో కలిసి చర్చించిన ఊహాజనిత సోషలిస్టుల అభిప్రాయాలు, ఈ చర్చలతో పోల్చితే, పిల్లల కథల్లా వున్నాయి.

ఈ కాలంలో మార్క్స్‌కు మూర్ అని మారు పడింది. తెలిసినవాళ్లందరూ అతణ్ణాపేరుతోనే పిలిచారు. నల్లటి జుత్తూ, చామనచాయ రంగులో ఉన్న చర్మానికే గాక, షిల్లర్ 'రాబర్స్' నాటకంలోని పాత్ర 'కార్ల్ వాన్‌మూర్'కు కూడా ఈ పేరు (mour) సంకేతం. జీవితమంతా అతని మిత్రులందరికీ అతడు మూర్.

బెర్లిన్ యూనివర్సిటీ మేధావుల్లో మార్క్స్ ప్రముఖ పాత్ర పోషించినా, మార్క్స్ గురించి, తండ్రికి మాత్రం సదభిప్రాయం లేదు. కుటుంబానికీ, తనకూ మధ్య ముఖ్యంగా, జెన్నీతో కూడా దూరం పెరిగిపోతున్నదని బాధపడ్డాడు. ఇక కొడుక్కి ఎవరూ పట్టరా! ఆగస్టు 1837లో రాసిన ఒక లేఖలో, ఇంటిని పూర్తిగా విస్మరించినందుకు ముఖ్యంగా పదకొండేళ్ల చిన్నకొడుకు ఎడ్వార్డ్ అనారోగ్యంతో వున్నా పట్టించుకోనందుకు మూడు నాలుగు నెలల తర్వాత ఎడ్వార్డ్ మరణించాడు. తల్లి బెంగపెట్టుకుంది. ఏడెనిమిది నెలలపాటు తండ్రి జబ్బుపడ్డాడు. ఒకసారి, కొడుక్కు కుటుంబం పట్ల వుండే బాధ్యతల్ని గుర్తుచేస్తూ మరో లేఖ రాశాడు. అందులో మొదటి అంశం :' నవ యువకుడిగా జెన్నీకి మంచి భవిష్యత్తునివ్వటం నీ బాధ్యత. అంటే ఈ ప్రపంచంలో మంచి భవిష్యత్తు. అంతేకాని, పొగాకు పొగలతో నిండిన

" తండ్రి అంత్యక్రియలకు రాకపోవటాన్ని ప్రస్తావిస్తూ, కొందరు చరిత్రకారులు మార్క్స్‌ది 'రాతి గుండె' అన్నారు. ఇది అప్పటి వాస్తవాలను అర్థం చేసుకోవటమే. ఒకవేళ అతడు తిరిగి వచ్చినా అప్పటికీ అంత్యక్రియలు జరిగిపోయి ఉండేవి. పైగా వెళ్లేటప్పుడే, తండ్రి వీడ్కోలు తీసుకున్నాడు కార్ల్. అంతేకాదు జీవితాంతం తండ్రి ఫొటోను, తన కోటు జేబులో దాచుకున్నాడు. నలభై అయిదేళ్ల తర్వాత మార్క్స్ మరణించినప్పుడు, అదే ఫొటోను మార్క్స్ శవపేటికలో పెట్టాడు ఎంగెల్స్. "

గదుల్లో, దీపం వెలుగులో విశృంఖలంగా ప్రవర్తించటం కాదు." మరో విషయం కూడా గుర్తు చేశాడు. "జెన్నీ తండ్రికి నువ్వు కృతజ్ఞుడిగా ఉండాలి. ఎన్ని అడ్డంకులున్నా, ఆ మహానుభావుడు మీ పెళ్లికి అంగీకరించాడు. నిజానికి ఏ తల్లిదండ్రులూ ఇలాంటి సంబంధాన్ని హర్షించరు. కొన్నిసార్లు నాకే అనిపించింది. అంతమంచి పిల్లను చేసుకునే అర్హత నీకుందా అని!"

తండ్రికి, కొడుకు పట్ల కోపం రోజురోజుకు పెరిగింది. వాడికి మేమంటే గౌరవం లేదు అన్నాడు. మరోసారి కార్ల్ లేఖను తిప్పి పంపిస్తూ 'పిచ్చిరాతలతో ప్రతిభను వృధా చేసుకుంటున్నావు. రాత్రంతా నువ్వు కూర్చుని సృష్టిస్తున్నది ఈ దయ్యం పిల్లలనా?" అనీ చీవాట్లేశాడు.

'ఒక సంవత్సరంలో, అత్యంత సంపన్నుడి కన్నా ఎక్కువ ఖర్చుపెట్టావు. దానికో కొత్త సిద్ధాంతం కనుక్కుంటున్నానని చెప్పి రాసినవన్నీ చింపేస్తున్నావు. అలాంటి నీకు చిన్న చిన్న విషయాలేం గుర్తుంటాయి. చెప్పు?' అంటూ వ్యంగ్యంగా దెప్పిపొడిచాడు మరోసారి.

తను మరణానికి దగ్గరగా వున్నానన్న భయంతో హైన్రిష్ నిస్పృహ, కోపం మరింత పెరిగింది. ఆశలన్నీ కొడుకు మీదే పెట్టుకున్నాడు. కానీ అవి నెరవేరే అదృష్టం తనకు లేదు. ఫిబ్రవరి 1838లో రాసిన చివరి ఉత్తరంలో 'నువ్వే నా సర్వస్వం' నీ మీదే నా ఆశలన్నీ అందుకే నువ్వంటే నాకు అప్పుడప్పుడూ చిరాకు, కోపం.కాని ఇక టైం లేదు. అలసిపోయాను. నీ కోసం నిరీక్షించినా ఫలితం లేదు. ఇదే నా చివరి ఆలింగనం' అంటూ..

ఈస్టర్ పండగకు కూడా ట్రేయర్‌కు రావాలనుకోలేదు. అప్పటికే ఒక సంవత్సరంలో తండ్రి సంపాదించిన దానికన్నా ఎక్కువ ఖర్చు పెట్టాడు బెర్లిన్‌లో. ఈ పరిస్థితుల్లో ట్రేయర్‌కు అయిదు రోజుల ప్రయాణం తలకు మించిన భారమవుతుంది. కానీ దిగజారుతున్న తండ్రి ఆరోగ్యం, తల్లీ చెల్లాయి రాస్తున్న ఉత్తరాలు రాకను అనివార్యం చేశాయి. ఏప్రిల్‌లో ట్రేయర్‌కు వచ్చి మే 7దాకా వున్నాడు. (తన ఇరవయ్యవ పుట్టినరోజు జరుపుకుని వెళ్లాడు). క్షయ, లివర్ వ్యాధులతో మే, 13నాడు మరణించాడు హైన్రిస్ మార్క్స్.

తండ్రి అంత్యక్రియలకు రాకపోవటాన్ని ప్రస్తావిస్తూ, కొందరు చరిత్రకారులు మార్క్స్‌ది 'రాతి గుండె' అన్నారు. ఇది అప్పటి వాస్తవాలను అర్థం చేసుకోవటమే. ఒకవేళ అతడు తిరిగి వచ్చినా అప్పటికీ అంత్యక్రియలు జరిగిపోయి ఉండేవి. పైగా వెళ్లేటప్పుడే, తండ్రి వీడ్కోలు తీసుకున్నాడు కార్ల్. అంతేకాదు జీవితాంతం తండ్రి ఫొటోను, తన కోటు జేబులో దాచుకున్నాడు. నలభై అయిదేళ్ల తర్వాత మార్క్స్ మరణించినప్పుడు, అదే ఫొటోను మార్క్స్ శవపేటికలో పెట్టాడు ఎంగెల్స్.

హైన్రిస్ మరణంతో, ఇంటివద్ద ఇప్పుడు మార్క్స్‌ను చీవాట్లేసే వాళ్లూ, కోప్పడే వాళ్లూ, అతడి మీద కోపం తెచ్చుకునేవాళ్లూ ఎవరూ లేరు. ఫిలాసఫీ చర్చలు ఆపి గౌరవప్రదమైన పని ఏదైనా చెయ్యమని ఎవరూ అతణ్ణి హెచ్చరించలేదు కానీ, అతని ఇంటి నుండి కాకపోయినా, మరికొన్ని సీరియస్ హెచ్చరికలు అతణ్ణి చేరాయి. వెస్ట్‌ఫాలెన్ ఇంటి నుండి వచ్చాయవి. అవి హెచ్చరికలు కావు. ఒక రకంగా బెదిరింపులు.

(మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్' ఆధారంగా)

సశేషం

▪ఫోన్: 91776 18708

శాంతి కోసం ప్రగాఢ ఆలింగనం

శాంతిని కోరుకోని వారెవరుంటారు చెప్పండి. యుద్ధాలు, గొడవలు, అల్లర్లు లేకుండా ప్రపంచం అంతా ప్రశాంతంగా వుండాలని ప్రతి నిముషం అనుకుంటాం. జపాన్‌కు చెందిన కొయిచి కువ్‌బరా అందుకోసం తనదైన ప్రయత్నం చేస్తున్నాడు. ప్రచారం చేస్తున్నాడు. ఈయనగారు ఇప్పటికి అనేక దేశాలు పర్యటించాడు. ప్రతి చోటా ఆసియాలో శాంతి గురించి చెప్తూ పురుషులను ఆలింగనం చేసుకుంటున్నాడు. 'ఆసియా దేశాధినేతల మధ్య ఎన్నైనా విబేధాలు వుండొచ్చు. సరిహద్దు సమస్యలు వుండొచ్చు. అన్నిటినీ పక్కనపెట్టి స్నేహపూరితంగా వుంటేనే శాంతి వర్ధిల్లుతుంది' అంటాడు కువాబరా. అందుకోసం చైనా, హాంగ్‌కాంగ్, దక్షిణ కొరియా, తైవాన్ దేశాలు పర్యటించి మరీ ముందుగా మనం చెప్పుకున్న పద్ధతుల్లో ప్రచారం చేశాడు. ఇక మీదట కూడా చేస్తాడట.

చెత్త వేస్తే..వదల బొమ్మాళీ!

చెత్త గురించి మనకు తెలీనిదేముంది? ఎక్కడ చూసినా కనిపిస్తుంది కదా. రోడ్ల మీదే ఊసేయడం, తిన్న తొక్కలు వేయడం, కాగితాలు విసిరేయడం, మిగిలిపోయిన ఆహార పదార్థాలను పడేయడం... మనకు కొత్తేం కాదు. బాగా అలవాటైన ప్రక్రియ. అయితే రష్యాలో మాత్రం ఓ మహిళ దీన్ని ఎంత మాత్రం సహించడం లేదు. తన కళ్లెదుట ఎవరైనా సరే... రోడ్ల మీద చెత్త వేశారో! అంతే సంగతులు. దాన్ని తీసుకుని బైకు మీద వెళ్లి మరీ తిరిగి వారి వాహనంలో వేసేస్తుంది. ఈ మధ్యే ఆమె ఒక వీడియో కూడా నెట్‌లో పెట్టేసింది. మూడు రోజుల్లో మూడు మిలియన్ల మంది ఆ వీడియో చూశారంటే నమ్మండి. ఇంతకీ ఆ వీడియోలో ఏం వుందనుకుంటున్నారు? ఓ వ్యక్తి కారులోంచి ఖాళీ నీళ్ల సీసాని విసిరేస్తాడు. అది ఈ బైకు మహిళ కంటబడింది. అంతే! దాన్ని తీసుకుని వేగంగా కారుని అనుసరించడమే కాక...కారు అద్దాల్లోంచి సీసాను లోపలికి విసిరేసింది. దీనికే ఆశ్చర్యపోకండి. మరో చోట ఓ వ్యక్తి తినగా మిగిలిన పదార్థాల సంచిని రోడ్డుమీద విడిచిపెట్టేసి వెళ్లిపోయాడు. ఈమె ఆ సంచిని పట్టుకుని బైకు మీద ఫాలో అయిపోయి ... కారు అద్దాల్లోంచి ఆ సంచిని లోపలికి వేసేసింది. ఈ ఘటనలు చూడ్డానికి చదవడానికి కూసింత వింతగా అనిపించినా... ఆమె ఉద్దేశ్యం ఒకటే. ఎవరి చెత్తను వారే శుభ్రం చేయాలి. అలా రోడ్లను ఆగం చేయకూడదు. కాకపోతే ఈ విషయాన్ని చెప్పడానికి ఆమె ఎంచుకున్న మార్గమే వెరైటీగా ఉంది.

బొమ్మ భర్త

విదేశాల్లో ఇలాంటి ఘటనలు జరుగుతూనే వుంటాయి. సెలబ్రిటీలను తమ జీవిత భాగస్వాములుగా ఊహించుకోవడం...వారితోనే జీవించాలనుకోవడం...అది అసాధ్యం కనక ... వారి బొమ్మలనే పెళ్లాడి కాపురం చేయడం. మనకు వింతగా వున్నా... అడపాదడపా వార్తల్లో వినిపిస్తూనే వున్నాయి. అలాంటి కథనానికి లాస్ వెగాస్ తాజా వేదికైంది. పాతికేళ్ల లౌరెన్ అడ్కిన్స్ హాలీవుడ్ హీరో రాబర్ట్ పాటిన్సన్‌తో ప్రేమలో పడింది. అది ఎంతగానంటే అతను లేకపోతే బతకలేనంతగా. కానీ అతగాడేమో అందనంత ఎత్తులో వున్నాడు. ఏం చెయ్యాలి? ఆరడుగుల కటౌట్ (బొమ్మ) ఒకటి చేయించుకుని దానితోనే సహజీవనం చేయసాగింది. ఇది చూసీ చూసీ ఓ నేస్తం ఒక సలహా ఇచ్చింది. అతన్ని అంతగా ప్రేమిస్తే పెళ్లి చేసుకోరాదూ?! అని. అంతే యాభై మంది అతిథులను పిల్చి మరీ భారీ కేకు కత్తిరించి కటౌట్‌నే పెళ్లాడింది. అందుకోసం 3,200 డాలర్లు కూడా ఖర్చు చేసింది. ఆ బొమ్మతోనే హనీమూన్‌కూ వెళ్లొచ్చింది. ఎందుకిలా? అంటే...లౌరెన్ ఏమంటోందో తెల్సా! "నాకు చిన్నప్పటి నుంచి ఊహాలోకాల్లోకి తీసుకెళ్లే కథలంటే చాలా ఇష్టం. సిండ్రిల్లా, ఏడుగురు మరుగుజ్జులు, స్నోవైట్...సినిమా క్యాసెట్లు విపరీతంగా చూసేదాన్ని. ఎంతగా అంటే అవి అరిగిపోయి బొమ్మ కూడా కనిపించకుండా వుండేంత వరకు. ఆ తర్వాత టీనేజ్‌లో ట్విలైట్ సిన్మాలంటే ఇష్టం ఏర్పడింది. అలా అందులో కథానాయకుడైన ఎడ్వర్డ్ కలెన్‌ను పిచ్చగా ఇష్టపడ్డాను. ఆ పాత్ర పోషించిన రాబర్ట్ పాటిన్సన్ మీద చెప్పలేనంత ఇష్టం ఏర్పడింది....' అని చెప్పుకొచ్చింది. అదండీ సంగతి.

అలా...మొదలై...ఇలా ఇప్పటికి ఈ తీరం చేరిందా ప్రేమ కథ. అదేనండీ ఒన్ సైడ్ ప్రేమ కథ. మరీ ఇంత పిచ్చి ప్రేమ ప్రమాదం కదూ!

సరి చేయాలోచ్



చిన్నారులూ... మీకు లెక్కలు బాగా వచ్చా? అయితే ఇక్కడ పక్కనున్న బొమ్మలో మాత్రం అంతా గజిబిజిగా ఉన్నాయి కదా.. అంటే అక్కడున్న వస్తువులకు ఎదురుగా ఉన్న సంఖ్య తప్పగా ఉంది కదా! మీరు వాటిని గమనించి ఏ సంఖ్యకు ఎదురుగా ఏమేం ఉండాలో.. చూసి గుర్తించండి..!



సమానం చేయండి

మీకు అగ్గి పుల్లలతో ఆట వచ్చా? పైనున్న బొమ్మలో కొన్ని అగ్గిపుల్లల్ని కదిలిస్తే రెండు పట్టికలు సమానంగా కనిపిస్తాయి. ఒక్కసారి కదిలించి చూడండి.. అయినా రాకపోతే మా జవాబు చూడండి.



జత చేసేద్దాం



పిల్లలూ... ఇక్కడ కొన్ని ప్రాణులతో పాటుగా అవి తినే ఆహారం కూడా వుంది. ఇంతకీ ఏది ఏం తింటుందో తెల్సా మీకు. అయితే జత చేయండి చూద్దాం!

పదాలు పూరిద్దాం!



పిల్లలూ... ఇక్కడ తొమ్మిది బొమ్మలున్నాయా! వాటిని ఇంగ్లీషులో ఏమంటారో మీకు తెల్సు కదా. పక్కనే వున్న గళ్లలో ఎంచక్కా నింపేయయ్యిడి. తర్వాత మా జవాబుతో పోల్చుకోండి.

జవాబు : 1.belt, 2. Pants, 3.mitten ,4. boot 5. Jacket, 6. Mustache, 7. Buckle, 8. Cap, 9. Beard

దారి కనుక్కోండి

బుజ్జీ నేస్తం బన్నీ. వాళ్ల ఇంటికి వెళ్లాలనుకుంది బుజ్జి. కానీ దారి మర్చిపోయింది. అంతా గజిబిజి గందరగోళంగా వుంది. అయితే మీరు దారి కనిపెట్టండి చూద్దాం!

వస్తువులేవి?



ఇక్కడున్న బొమ్మలో కొన్ని వస్తువులు దాగున్నాయి. అవేంటో తెలుసా...! స్కూల్ బ్యాగ్, మూడు పెన్సిళ్లు, టిఫిన్ బాక్స్, వాటర్ బాటిల్, క్రేయాన్ బాక్స్. వాటిని కనిపెట్టి సున్నా చుట్టేయండి.

తేడాలేవి?



ఇక్కడ రెండు బొమ్మలున్నాయి. చూడ్డానికి ఒకేలా వున్నా... వాటిలో పది తేడాలున్నాయి. వాటిని గుర్తించి సున్నా చుట్టేసేయండి.

కోడి పెట్ట గీద్దామా!





ఎవరి నీడ ఏది?



ఆ గ్రామం కవల పిల్లల కారణంగా అంతర్జాతీయ ఖ్యాతినార్జించింది. రెండువేల కుటుంబాలు నివసించే ఆ చిన్ని ఊళ్లో 400 జతల కవలలు ఉన్నారంటే నమ్మగలరా? ప్రపంచాన్నే ఆశ్చర్యంలో ముంచెత్తుతున్న ఆ ఊరు మరెక్కడో లేదు. కేరళలోని మలప్పురం జిల్లాలో వుంది. పేరు 'కొడిని'.



కవలల గ్రామం

ఎక్కడైనా సరే! వెయ్యి జననాల్లో ఆరు జతల కవలలు వుండడం సహజం. కానీ కొడిని గ్రామంలో మాత్రం ప్రతి వెయ్యి జననాలకు 45 జతల కవలలు పుట్టారు. సున్నీ ముస్లింలు ఇక్కడ అధిక సంఖ్యలో ఉన్నారు. విశేషం ఏమంటే... ఇక్కడి మహిళలకు పెళ్లిళ్లయి సుదూర ప్రాంతాలకు వెళ్లినా సరే... వారికి కూడా కవలలు జన్మిస్తున్నారు. ఇక్కడి యువకులను వివాహమాడిన వేరే ప్రాంతాల మహిళలు కూడా కవలలకు పుడుతున్నారు. ఇటీవలి కాలంలో ఇది మరింతగా పెరిగిందనడానికి గత పదేళ్లలో పుట్టిన ఇక్కడ కవల జననాలు పెరుగుతున్నాయనడానికి రుజువు కూడా వుంది. పదేళ్లలోపు పిల్లల్లో 80 జతల కవలలు ఉన్నారు.

కవల పిల్లలు పుడితే కుటుంబంలో సంతోషం నెలకొంటుంది. అయితే దానితో పాటు ఇబ్బందులూ ఉంటాయి. ఇక్కడి స్కూలు టీచర్లు కూడా కవల విద్యార్థులను గుర్తు పట్టలేక తికమక పడుతుంటారు. కొత్తగా పెళ్లయిన జంటలు కూడా తమ భాగస్వాములెవరో, వారి కవల సోదరులు లేదా సోదరీలెవరో గుర్తు పట్టడం కొంత కాలం కష్టంగానే ఉంటుంది. ఈ గ్రామంలోని కవలలందరూ ఓ సంఘంగా (టాకా) ఏర్పడ్డారు. ఇందులో 600 మంది సభ్యులుగా చేరారు. 85 ఏళ్ల మహమ్మద్ హాజీ గ్రామంలోని కవలల్లో అందరి కంటే పెద్దవాడు. 'కవల పిల్లలు పుడితే సంతోషమే కానీ ఆర్థికంగా కుటుంబంపై భారం పడుతుంది. తల్లులకు కూడా ఇద్దరిని పెంచడం కష్టంగా ఉంటుంది. వారికి తగిన సలహాలు, సూచనలు, తోడ్పాటు అందించాలనే ధ్యేయంతో కవల పిల్లల తల్లిదండ్రులందరూ కలిసి సంఘంగా ఏర్పడ్డాం' అన్నారు కవలల తండ్రి భాస్కరన్. ఆయన కొడుకు అభి మాట్లాడుతూ 'కవలలుగా పుట్టడం మాకెంతో ఆనందాన్నిస్తుంది. మేము మా స్నేహితులను, టీచర్లను ఆట పట్టిస్తుంటాం' అన్నాడు. వారు సరదాగా ఒకసారి ఎయిర్‌పోర్టులో తమ పాస్‌పోర్టులను మార్చి ఇమిగ్రేషన్ అధికారులనే బోల్తా కొట్టించారు. ఐదేళ్ల చిన్నారి షహలా మాట్లాడుతూ 'అల్లరి చేయాలనిపిస్తే మా అక్క స్థానంలో నేను, నా స్థానంలో అక్క కూర్చుంటాం. అందరినీ తికమక పెట్టి ఆట పట్టిస్తుంటాం. టీచర్లు కూడా మమ్మల్ని గుర్తు పట్టలేరు' అంటుంది కొంటెగా.

ఈ గ్రామంలోని కవలలపై జాతీయ జన్యు శాస్త్రవేత్తల బృందం అధ్యయనం చేసింది. వీరిలో హైదరాబాద్‌లో ఉన్న 'సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ' నుంచి జీఆర్ చందక్, పూనెలో ఉన్న 'సెంటర్ ఫర్ హ్యూమన్ గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్' సభ్యురాలు కౌముది గోడ్బోలే కూడా వున్నారు. డజను మంది కవలలను వారి ఆహారపు అలవాట్లు, వారసత్వం, వాతావరణం, తల్లిదండ్రులు వంటి ఎన్నో అంశాలను పరిశీలించారు. వీరు అందిరిలానే అన్నం, కూరలే తింటారు. 14వేల మంది నివసించే ఈ గ్రామంలో కవలలు అధికంగా ఎందుకు పుడుతున్నారో మాత్రం అంతు పట్టలేదు. కవల జననాల వెనుక సామాజిక కోణం ఏమైనా ఉందా? అనే కోణంలో మరింత సమగ్రంగా పరిశోధన చేయనున్నారు.

గత దశాబ్ద కాలంగా ఇక్కడ కవల జననాలు పెరిగాయని తిరురంగడి తాలూకా ఆస్పత్రి వైద్యులు చెప్తున్నారు. స్థానిక వైద్యుడు, కవలలపై ఆసక్తి ఉన్న డా. కృష్ణన్ శ్రీబిజు గత రెండేళ్లుగా ఈ విషయమై పరిశోధనలు చేస్తున్నారు. ఈ గ్రామంలో 18-20 ఏళ్ల వయసులోనే పెళ్లిళ్లు జరుగుతాయి, అక్కడి మహిళలందరూ దాదాపు 5 అడుగులు మాత్రమే ఉంటారు. 2008లో మొత్తం 300 మంది పుడితే.... వారిలో 15 జతల కవలలున్నారు. ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో కవల పిల్లలు పుట్టడం చాలా తక్కువ. కానీ ఇక్కడ మాత్రం ప్రపంచంలోకెల్లా అత్యధిక కవల జననాల రేటు నమోదవుతోంది. దాదాపు ప్రతి కుటుంబంలో కవలలు కనిపిస్తారు. యువత, మధ్య వయస్కులు, వృద్ధులు షాపుల వద్ద, మార్కెట్‌లో ప్రతి చోటా కవలలు దర్శనమిస్తారు.

ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ జిల్లాలో ఉన్న ఉమ్రీ గ్రామం కూడా కవల పిల్లల కారణంగా పేరు మోసింది. ఆరువేల మంది నివసించే ఈ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా లేదు. అయినా ఇక్కడ 108 జతల కవలలు ఉన్నారు. వీరిని గుర్తు పట్టలేనంతగా అచ్చు గుద్దినట్టు ఉంటారు. ఇక్కడ ప్రతి పది జననాల్లో ఒక కవలలు ఉన్నారు. ఇది ప్రపంచ రికార్డు. ఆర్థికంగా భారమైనా సరే, కవలలు పుట్టడం గర్వకారణంగా భావిస్తారు ఇక్కడి ప్రజలు. ★

శ్రీ మహా పోచమ్మ దేవస్థానము

గ్రా॥ ఆడెల్లి, మం॥ సారంగాపూర్, జిల్లా ॥ ఆదిలాబాద్

శ్రీ మహా పోచమ్మ వారి గంగనీళ్ల జాతర మహోత్సవం

తేది: 27-09-2014 నుండి 28-09-2014

- తేది : 27-09-2014 శనివారము రోజున ఉదయం 11-00 గంటలకు శ్రీ మహా పోచమ్మ వారి ఆభరణాలతో సేవాదారులు గోదావరికి బయలు దేరడం.
- తేది : 28-09-2014 ఆదివారము గోదావరిలో అమ్మవారి ఆభరణములు శుభ్రం చేసుకొని వారు తెచ్చిన గంగనీళ్లతో శ్రీ అమ్మవారికి అభిషేకం (పవిత్రోత్సవం) నిర్వహించబడును.

కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదములు స్వీకరించి తరించగలరని కోరుచున్నాము

శ్రీ గుమ్ముల రవి చైర్మన్

ధర్మకర్తలు :

యస్. రాజేశ్వర్ రావు, ఆర్. సాయమ్మ, డా॥ యస్. గోవర్థన్ రెడ్డి, యం. బ్రహ్మయ్య, డి. సాయన్న, టి. లింగన్న, సిహెచ్. రాజేశ్వర్ రెడ్డి, బి. రాజన్న, డి. శ్రీనివాస్

టి. నారాయణ

సిబ్బంది మరియు అర్చకులు

గమనిక : నిర్మల్, బైంసా డిపోల నుండి దేవాలయం వరకు ప్రత్యేక బస్సులు నడుపబడును మరియు పోలీసు బందోబస్తు, వైద్య సౌకర్యం నీటి సౌకర్యం ఏర్పాటు చేయనైనది

జీవిత కాలపు అనుబంధం

జైన్ సంస్థ మాత్రమే చేయగల ఒక వాగ్దానం
జైన్ డ్రిప్ వారి విశ్వసనీయమైన విధానం ద్వారా అత్యధిక దిగుబడి

జీవిత భాగస్వామిని ఎంచుకొనడంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకొంటామో ఒక బిందుసేద్య విధానాన్ని ఎంచుకునేప్పుడు కూడ అంతే జాగ్రత్త అవసరం. వంశాను క్రమం, కుటుంబ పరపతి మరియు జీవితకాలపు నిబద్ధత రెండిటికి సమానమే. మీరు చూపే అన్ని సలక్షణాలు జైన్‌డ్రిప్‌లో ఉన్నాయి. భారతదేశంలోఅత్యంత ప్రజాదరణ కల్గిన సేద్యపు విధానం జైన్ బిందుసేద్యం. ఎందుకు జైన్ బిందు సేద్యమే ఎన్నుకోవాలి.

- కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా విస్తృతంగా వాడబడేది జైన్ సూక్ష్మ సేద్య విధానం మాత్రమే.
- 48 విభిన్న పంటలలో 15.2 [illegible] జైన్ బిందుసేద్యమే.
- అన్ని పరికరాలు సొంత ఫ్యాక్టరీలలో తయారు చేయబడి మీ అవసరాలకు పూర్తి పరికరాల్ని రూపొందించి అమర్చగలగడమే కాక విక్రయానంతర సేవలందించే సామర్థ్యం గల కంపెనీ జైన్ మాత్రమే.
- అంతర్జాతీయ ప్రమాణాలు కలిగి యుండి జాతీయ, అంతర్జాతీయ అవార్డులను పొందిన ఏకైకభారతదేశపు బిందుసేద్య వాధానం జైన్ బిందు సేద్య విధానం మాత్రమే.
- మీ సేద్యపు నీటి సమస్యలకు సరైన పరిష్కారము. పంట దిగుబడిలో అభివృద్ధి!.
- నీటి వాడుకములో 30-40% పొదుపు!. కూలీ ధరలలో ఆదా!, కరెంటు ఆదా!.
- దేశమంతా మారుమూల ప్రాంతాలకుకూడ విస్తరించిన డీలర్ల నెట్‌వర్క్, మరియు విక్రయానంతర సేవాకేంద్రాలు కలవు. కంపెనీ ప్రతినిధులు మీకు అందుబాటులో ఎల్లవేళల సేవలందించుదురు.

జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

1-1-782/ బి /5, పార్క్‌ఎదురుగా, కెనరాబ్యాంక్ దగ్గర,
గాంధీనగర్, హైద్రాబాద్- 500 080.
ఫోన్: 040-2761 2593, 2765 4681. 9440797846 /881.
Email: jainhyderabad@jains.com, Website: www.jains.com

జైన్ పైపులు | జైన్ డ్రిప్ | జైన్ పిఇ పైపులు | జైన్ స్ప్రింక్లర్స్ | జైన్ గ్రీన్ హౌస్ | జైన్ టిష్యూకల్చర్ | జైన్ టిపిడి సోలార్ పంప్

బిందు బింబాలు

మంచు కురిసే వేళలో...అలా తోటకెళితే...ఎన్ని అందాలో! పచ్చటి మొక్కలు, విరిసీ విరియని పూలు, వాటి మీద అంటీఅంటనట్టు కనిపించే మంచు బిందువులు...వావ్! చూడ్డానికి రెండు కళ్లూ చాలవు. వర్ణించడానికి ఎన్ని పదాలు సరి రావు. ఓ సన్నపాటి గడ్డి పరక మీద వయ్యారంగా ... వుండీ వుండనట్టు కనిపించే నీటి బొట్టు మీద... ప్రతిబింబం ఏదైనా కనిపిస్తే...ఏమనిపిస్తుంది? ఎంతసేపైనా అలా చూస్తూ వుండిపోవాలనిపిస్తుంది. కానీ అది అసాధ్యం! ఎందుకంటే ఆ మంచుముత్యం జీవితం క్షణ భంగురం కనక! అలాంటి అద్భుత దృశ్యాలను కెమెరాలో బంధించామనుకోండి. ఎంతసేపైనా చూస్తూ వుండిపోవచ్చు. మీ ఎదురుగా వున్న బిందు బింబాలు అవే. రకరకాల సుమాలు నీటి బిందువుల ప్రతిబింబాలైన వేళ...తన కెమెరా కంటితో క్లిక్ మనిపించాడు బెట్రాండ్ కులిక్.

పారిస్ వాసి అయిన బెట్రాండ్‌కు ఫొటోలు తియ్యడమన్నా, వయొలిన్ వాయించడమన్నా చాలా ఇష్టం. ఫొటోలంటే మామూలు ఫొటోలు తియ్యడీయన. తన ఇంటి వెనక పెరట్లోకి జొరబడి... గంటల తరబడి నిలబడి... ఇదిగో ఇలాంటి చిత్రరాజాలను ప్రపంచానికి అందిస్తుంటాడు. ఏడాదంతా మంచు కురవదు కనక...అవసరమైతే చెట్ల మీద నీళ్లు చిలకరించి మరీ నీటి బిందువులను సృష్టిస్తాడు. వాటికి అత్యంత సమీపంగా నిలబడి తన కానన్ (ఎంపి-ఇ 65 మి.మీ లెన్సులు) కెమెరాకు పని చెప్తాడు. అదిగో అలా తన పెంపుడు కుక్కను సైతం నీటిబొట్టుమీద పట్టేశాడు. ‘ బయటికెళ్లానంటే చేతిలో కెమెరా వుండాల్సిందే. అది లేకపోతే...నేను చూసినవన్నీ మిస్సయిన బాధ కలుగుతుంది. అదే కెమెరా చేతిలో వుంటే మనసుకు నచ్చిన దృశ్యాలను బంధించేస్తా కదా’ అంటాడు నవ్వుతూ.

ఏదోలెండి? అంతా బిందు బంధం మహిమ!

❄